



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 82 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 15 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## రెండేళ్ల బాలికను చిదిమేసిన దుర్మార్గుడిని ఉరి తీయాల్సిందే...

### క్షమాభిక్ష తిరస్కరించిన రాష్ట్రపతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** 2012లో మహారాష్ట్రలో రెండేళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, హత్య చేశాడు ఓ దుర్మార్గుడు. ఈ కేసులో దోషిగా తేలిన వ్యక్తి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. జూలై 25, 2022న పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మిగతా .. 2లో..

## బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబిన్

### అభినందించిన ప్రధాని మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడిని ప్రకటించింది. బీహార్ మంత్రి నితిన్ నబిన్ పార్టీ కొత్త తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన జెపి నడ్డా స్థానంలో మిగతా .. 2లో..

## సత్యమనే నినాదంతో.. కేంద్ర సర్కారును గద్దెదించుతాం..

### రాహుల్ గాంధీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** సత్యమనే నినాదంతో మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును గద్దెదించుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అధికారంలో ఉన్నవారు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. భాజపా ప్రభుత్వంతో కలిసి ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మిగతా .. 2లో..




కొనసాగుతున్న

## రెండో విడత కౌంటింగ్

### ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థులు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల హవా కొనసాగుతోంది. తొలి విడతలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని జోష్ మీదున్న ఆపార్టీ.. రెండో విడతలోనూ విజయపరంపర కొనసాగిస్తోంది. 193 మండలాల్లోని మిగతా .. 2లో..

డివైడర్‌ను ఢీ కొట్టి

## లారీ బోల్తా



**సామర్లకోట, విశ్వం వాయిస్ న్యూస్ :** సామర్లకోట కాకినాడ కెనాల్ రోడ్డు రైల్వే గూడ్స్ షెడ్ ఎదురుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి డివైడర్ ఆదివారం తెల్లవారుజామున ఒక లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు, లారీ బోల్తా కొట్టిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.




## ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు..

### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటానికి భారత్ పూర్తి మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరం బాండి బీచ్‌లో ఉగ్ర కాల్పుల ఘటనపై ప్రధాని స్పందించారు. సాధారణ పౌరుల్ని లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపడం హేయమైన చర్య అని అన్నారు. ఈ ఉగ్ర ఘటన తనను షాక్‌కు గురిచేసిందన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారికి భారత ప్రజల తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుఃఖ సమయంలో ఆస్ట్రేలియాకు భారత్ మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. మరోవైపు భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కూడా సిడ్నీ ఘటనను తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమ ఆలోచలన్నీ ఆప్తులను కోల్పోయిన వారిచుట్టూనే ఉన్నాయంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరో 16 మంది తీవ్రంగా గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఇద్దరు సాయుధులైన దుండగులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో.. ఒక్కసారిగా అక్కడ భీతావహ పరిస్థితులు ఏర్పడ్డాయి. వందలాది మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు.

ప్రాణాలను పణంగా పెట్టి...

ఉగ్రవాదులకు ఎదురొడ్డిన

## 'రియల్ హీరో' అహ్మద్



**విశ్వం వాయిస్ న్యూస్ :** నడి రోడ్డుపై ప్రమాదం జరిగి గాయాలతో కొట్టుమిట్టాడుతుంటే.. సాయం చేసేందుకు చాలా మంది వెనుకాడుతుంటారు. ఎక్కడ పోలీసు కేసు అవుతుందోనని భయపడతారు. అలాంటిది ఇద్దరు సాయుధ ఉగ్రవాదులు మిగతా .. 2లో..

గుడివాడలో

## భారీ అగ్నిప్రమాదం




**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా గుడివాడలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. నెహ్రూ చౌక్ సెంటర్‌లోని అద్దేపల్లి కాంప్లెక్స్‌లో భారీగా మంటలు చెలరేగాయి. తొలుత సెల్‌ఫోన్ దుకాణంలో వచ్చిన మంటలు.. క్రమంగా మిగతా షాపులకు వ్యాపించాయి. ఇదే కాంప్లెక్స్‌లో జూనియర్ మిగతా .. 2లో..

హాస్టల్ విద్యార్థుల పట్ల నిరక్ష్యం చూపితే

## కఠిన చర్యలు

### బాధ్యులపై చర్యలు తీసుకోండి : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ తో మంత్రి ఫోన్ మాట్లాడుతూ, హాస్టల్ లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుకు పైగా రావడానికి కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన ఆదివారం విడుదల చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజ వర్గం ఓడీ చెరువు మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో మిగతా .. 2లో..




వచ్చేస్తోంది...

## శ్రీవారి 'ఏఐ' సేవక్

### భక్తులకు 'ఏఐ చాట్‌బాట్' సేవలు - 15 రోజుల్లో అందుబాటులోకి..

### 13 భాషల్లో సమాచారం.. క్షణాల్లో సమాధానం...

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వారణాసి నుంచి తిరుమల శ్రీవారి దర్శనానికి రావాలనుకున్న ఓ భక్తుడికి సేవా టికెట్లపై సందేహం వచ్చింది. కాల్ సెంటర్‌కు ఫోన్‌చేస్తే లైన్ బిజీ. పోనీ మెయిల్ పెడదామంటే సమాధానం అనుకున్న సమయానికి వస్తుందో లేదో తెలియదు. ఇంగ్లిష్, హిందీ మిగతా .. 2లో..

నా ఉన్నతికి కారణం

## ఉపాధ్యాయులే...

### డాన్‌బాస్కో పాఠశాల స్వర్ణోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'నా ఉన్నతికి నా ఉపాధ్యాయులే కారణం. ఏ స్థాయికి వెళ్లినా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలు, గురువును మర్చిపోకూడదు' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రబాలెం వద్ద ఉన్న డాన్‌బాస్కో తెలుగు మీడియం ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వర్ణోత్సవ శిలాఫలకాన్ని, ఆధునికీకరించిన సైన్స్ ప్రయోగశాలను ఆయన ప్రారంభించారు. పాఠశాల వ్యవస్థాపకుడు రెవ.ఫాదర్ థామస్ చిన్నప్ప విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ.. 'చదువుకునే సమయంలో ఎక్కువ సమయం ఉపాధ్యాయులతోనే గడుపుతాం. ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చానంటే ఉపాధ్యాయిని మంజులా మేడం, నారాయణ, రాజారెడ్డి మాస్టార్లు కారణం. ఏ స్థాయికి వెళ్లినా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం అందించాలి. జీవితంలో విలువలతో కూడిన నిర్ణయాలను తీసుకోవాలి. అన్ని సమస్యలనూ ఒక వ్యక్తి లేదా ఓ వ్యవస్థ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## నా ఉన్నతికి కారణం
# ఉపాధ్యాయులే...

తీర్చలేవు. అందరూ కలిసి పనిచేసినప్పుడే ఆశించిన మార్పు వస్తుంది. డాన్‌బాస్కో పాఠశాలను దేశంలోనే అద్భుత పాఠశాలగా తీర్చిదిద్దుతాం. తెలుగు రాష్ట్రాల్లో 35 డాన్‌బాస్కో పాఠశాలలు విద్యతో పాటు విలువలను అందిస్తున్నాయి. ఎయిడెడ్ వ్యవస్థ రద్దయి మూడేళ్లవుతోంది, తమను ఆదుకోవాలని గతంలో ఆ విద్యాసంస్థల ప్రతినిధులు కోరారు. విద్యా శాఖ మంత్రిగా అండగా నిలుస్తాను' అని పేర్కొన్నారు. సెకండరీ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, విజయవాడ బిషప్ జోసఫ్ రాజారావు, ఫాదర్ సంతియాగు థామస్, మంగళగిరి డాన్‌బాస్కో ప్రతినిధి రెక్టర్ ఫాదర్ చిన్నప్ప, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**బ్రాహ్మణికి పురస్కారం.. భర్తగా గర్వపడే క్షణం: లోకేశ్**

'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్' పురస్కారాన్ని నారా బ్రాహ్మణి అందుకోవడంపై ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ స్పందించారు. "భర్తగా గర్వపడే క్షణం. భవిష్యత్తు గురించి దూరదృష్టి, ఆలోచన, మాటలకంటే చేతల్లో చూపడం ఆమెలోని గొప్ప నాయకత్వ లక్షణాలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

## వచ్చేస్తోంది...
# శ్రీవారి 'ఏఐ' సేవక్

అంతంత మాత్రమే వచ్చు.. తన మాతృభాషలో సమాచారం దొరకదు. ఇది తిరుమల వచ్చే చాలామంది భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బంది.. ఇలాంటి నిరీక్షణకు, భాషాపరమైన ఇబ్బందులకు చెక్‌పెడుతూ.. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే కోట్ల మంది భక్తులకు మెరుగైన సేవలందించే దిశగా తితిదే మరో ముందడుగు వేసింది. ఇప్పటికే ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉండగా.. భక్తుల సందేహాలను తక్షణం నివృత్తి చేసేందుకు, డిజిటల్ సేవలను మరింత చేరువ చేసేందుకు ఏఐ ఆధారిత 'చాట్‌బాట్'ను మరో 15 రోజుల్లో అందుబాటులోకి తీసుకురానుంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సహకారం, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) క్లౌడ్ వేదికగా ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది.

**మానవ ప్రమేయం లేకుండా..**

ప్రస్తుతం తితిదే కాల్ సెంటర్లు, ఈమెయిళ్లు, సామాజిక మాధ్యమాల ద్వారా భక్తులు పెద్దఎత్తున వినతులు, ప్రశ్నల రూపంలో సంప్రదిస్తున్నారు. దర్శన టికెట్లు, వసతి, రవాణా, రిఫండ్ల వంటి అంశాలపై భక్తులు అడుగుతున్న సందేహాలకు సమాధానం ఇవ్వడంలో మానవ వనరుల పరిమితులతో జాప్యం జరుగుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 24 గంటలూ నిరంతరాయంగా పనిచేసే ఏఐ చాట్‌బాట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

**ఏటా రూ.50 లక్షల వ్యయం**

క్లౌడ్ సేవల కోసం నెలకు సుమారు రూ.4 లక్షల చొప్పున, ఏడాదికి పన్నులు మినహాయించి దాదాపు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా. వినియోగాన్ని బట్టి ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిపేలా తితిదే బోర్డు నిర్ణయం తీసుకుంది.

**సేవలు ఇలా**

ఇది ఒకేసారి వేల సంఖ్యలో భక్తులతో సంభాషించగలదు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 13 భారతీయ భాషల్లో సేవలందించనుంది. దర్శన టికెట్ల బుకింగ్ ప్రక్రియలో మార్గనిర్దేశం చేయడంతో పాటు రియల్ టైమ్ సమాచారం అందిస్తుంది. టైప్ చేయడమే కాకుండా.. 'స్పీచ్ టు టెక్స్ట్', 'టెక్స్ట్‌టు స్పీచ్' వంటి ఆధునిక ఫీచర్లు ఉండనున్నాయి.

# కఠిన చర్యలు

లక్ష్మీనరసింహా తొమ్మిదో తరగతి, భార్గవ్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. హాస్టల్ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేసుకున్న మండపానికి ప్రసాదం కోసం వంట పాత్రలతో వెళ్లారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు ఇద్దరు విద్యార్థులను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీ నరసింహా తలకు బలమైన గాయం కావడంతో అనంతపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థి భార్గవ్ ను కదిరి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందజేస్తున్నారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ తో ఫోన్ లో మాట్లాడి, విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలన్నారు. వంట పాత్రలిచ్చి ప్రసాదం ఎవరు తీసుకు రమ్మనారో తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టల్ లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డుపైకి ఎందుకొచ్చారని డీఎస్సీడబ్ల్యూవో రెడ్డి బాలాజీని మంత్రి ఫోన్ లో ప్రశ్నించారు. తక్షణమే గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమందించాలని, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, సంబంధిత హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## గుడివాడలో
# భారీ అగ్నిప్రమాదం

కళాశాల, ఎస్‌బీఐ శాఖలు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటనాస్థలాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. ప్రమాదంతో సుమారు రూ.కోటి ఆస్తి నష్టం జరిగినట్లు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి ఆంజనేయులు తెలిపారు.

## ప్రాణాలను పణంగా పెట్టి... ఉగ్రవాదులకు ఎదురొడ్డిన
# 'రియల్ హీరో' అహ్మద్

విచక్షణారహితంగా కాల్పులు జరుపుతుంటే.. సాధారణంగా ఎవరైనా తమ ప్రాణాలు కాపాడుకునేందుకే ప్రయత్నిస్తారు. కానీ, సిడ్నీ ఉగ్ర కాల్పుల ఘటనలో 'రియల్ హీరో' అనిపించుకుంటున్న అహ్మద్ అల్ అహ్మద్ మాత్రం ప్రాణాలకు తెగించి పోరాడారు. తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 (స్థానిక కాలమానం) గంటలు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఉన్న బాండి బీచ్‌లో పర్యాటకులంతా సేదతీరుతున్నారు. అంతలో ఇద్దరు ఉగ్రవాదులు అక్కడికి వచ్చి.. విచక్షణారహితంగా కాల్పులు మొదలుపెట్టారు. ఓ ఉగ్రవాది చెట్టు చాటు నుంచి బుల్లెట్ల వర్షం కురిపిస్తున్నాడు. అదంతా గమనించిన 43 ఏళ్ల అహ్మద్ అల్ అహ్మద్.. మెరుపు వేగంతో వెనక నుంచి వచ్చి ఓ ఉగ్రవాదిని గట్టిగా పట్టుకున్నాడు. అతడి చేతిలోని గన్‌ను లాక్కొని తిరిగి అతడికే ఎక్కుపెట్టాడు. అది చూసిన మరో ఉగ్రవాది.. అహ్మద్ లక్ష్యంగా కాల్పులు జరిపాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా అహ్మద్ కుప్పకూలిపోవడంతో.. ఉగ్రవాది అక్కడి నుంచి పారిపోయాడు. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న భద్రతా బలగాలు ఓ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. మరో ఉగ్రవాది 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నాయి. స్థానికులు, పోలీసులు అహ్మద్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి చికిత్స కొనసాగుతున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ప్రాణాలకు తెగించి ఉగ్రవాదులతో పోరాడిన అహ్మద్‌ను స్థానిక మీడియా 'రియల్ హీరో'గా అభివర్ణిస్తోంది. అహ్మద్ అతి సామాన్యుడు. ఓ పండ్ల దుకాణం పెట్టి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అలాంటి వ్యక్తి ఏ మాత్రం భయపడకుండా ఉగ్రవాదులతో పోరాడిన తీరుపై సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# రెండో విడత కౌంటింగ్

3,911 గ్రామ పంచాయతీ సర్పంచులు, 29,917 వార్డు సభ్యుల పదవులకు ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పోలింగ్ ముగిసింది. 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. రాత్రి 7:30 గంటల వరకు వెలువడిన ఫలితాలను బట్టి.. కాంగ్రెస్ బలపర్చిన సర్పంచి అభ్యర్థులు 1500కు పైగా, భారత రాష్ట్ర సమితి మద్దతుతో 800కు పైగా, భాజపా 190, ఇతరులు 440కు పైగా స్థానాల్లో విజయం సాధించారు.

**లాటరీలో వరించిన విజయం..**

మెదక్ మండలం చీపురుదుబ్బతండా గ్రామ సర్పంచి ఎన్నిక ఫలితం డ్రాలో తేలింది. చీపురుదుబ్బతండా పంచాయతీకి మోటు కాడి తండా, నైలి తండా అనుబంధంగా ఉన్నాయి. మొత్తం 3 తండాల్లో కలిపి 377 ఓట్లు ఉండగా.. 367 ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన కేతావత్ సునీతకు 182, భారత రాష్ట్ర సమితి మద్దతుతో పోటీ చేసిన బీమిలికి 182 ఓట్లు లభించాయి. ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో రిటర్నింగ్ అధికారి వెంకటయ్య డ్రా తీశారు. లాటరీలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతను అదృష్టం వరించింది. దీంతో ఆమె సర్పంచిగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

# రెండేళ్ల బాలికను చిదిమేసిన దుర్మార్గుడిని ఉరి తీయాల్సిందే...

రాష్ట్రపతి తిరస్కరించిన మూడవ క్షమాభిక్ష పిటిషన్ ఇది..! 2012లో మహారాష్ట్రలో రెండేళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, హత్య చేశాడు ఓ దుర్మార్గుడు. ఈ కేసులో దోషిగా తేలిన వ్యక్తి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. జూలై 25, 2022న పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రపతి తిరస్కరించిన మూడవ క్షమాభిక్ష పిటిషన్ ఇది..! అక్టోబర్ 3, 2019న నిందితుడు రవి అశోక్ ఘుమారేకు విధించిన మరణశిక్షను సుప్రీంకోర్టు సమర్థించింది. రవి అశోక్ ఘుమారేకు తన లైంగిక కోరికలపై నియంత్రణ లేదని, తన వాంఛలను తీర్చుకోవడానికి అన్ని సహజ, సామాజిక, చట్టపరమైన సరిహద్దులను దాటాడని కోర్టు పేర్కొంది. జస్టిస్ సూర్యకాంత్ (ప్రస్తుతం భారత ప్రధాన న్యాయమూర్తి) నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తన తీర్పులో, ఆ వ్యక్తి పసిమొగ్గలారని చిన్నారి జీవితాన్ని దారుణంగా చిదిమేసినట్లు పేర్కొంది. రెండేళ్ల బాలికపై అసహజ నేరాలకు పాల్పడిన అతని చర్య నీచమైన, వికృత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపింది. క్రూరత్వం, భయంకరమైన చర్యలకు పాల్పడ్డ నిందితుడికి సరియైన శిక్ష అని ధర్మాసనం పేర్కొంది. అయితే, అశోక్ ఘుమారే క్షమాభిక్ష పిటిషన్‌ను నవంబర్ 6, 2025న రాష్ట్రపతి తిరస్కరించారు. బాధితురాలు కేవలం రెండేళ్ల బాలిక అని, ఆమెను అప్పీలుదారు అపహరించి, ఆమె చనిపోయే వరకు నాలుగు నుండి ఐదు గంటలు వేధింపులకు గురిచేశారని పేర్కొన్నారు. బిడ్డకు తండ్రి ప్రేమ, ఆప్యాయత, సమాజంలోని చెడుల నుండి రక్షణ కల్పించడానికి బదులుగా, ఆమెను లైంగిక వాంఛకు గురిచేశాడని పేర్కొంది. ఇది ద్రోహం, సామాజిక విలువలకు అవమానకరమైన కేసు అని తీర్పు పేర్కొంది. రెండేళ్ల బాలికతో అసహజ లైంగిక దాడి వికృత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని వెల్లడించింది. ఈ సంఘటన మార్చి 6, 2012న మహారాష్ట్రలోని జల్నాలోని ఇందిరా నగర్ ప్రాంతంలో జరిగింది. రవి అశోక్ ఘుమారే బాధితురాలికి చాక్లెట్లతో ప్రలోభపెట్టి, ఆపై ఆమెను తన కామానికి గురిచేశాడు. ఫలితంగా 2 ఏళ్ల బాలిక మరణించింది. రవి అశోక్‌ను దిగువ కోర్టు దోషిగా నిర్ధారించింది. సెప్టెంబర్ 16, 2015న మరణశిక్ష విధించింది. అతని మరణశిక్షను బాంబే హైకోర్టు 2016 జనవరిలో సమర్థించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా అతని క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో అతనికి మరణ దండన ఖాయమైంది.

# బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నితిన్ నబిన్

పార్టీ కొత్త నాయకుడిగా నియమితులవుతారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నవీన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిని ప్రకటించింది. బీహార్ మంత్రి నితిన్ నబిన్ పార్టీ కొత్త తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన జెపి నడ్డా స్థానంలో పార్టీ కొత్త నాయకుడిగా నియమితులవుతారు. భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన లేఖలో, "భారతీయ జనతా పార్టీ పార్లమెంటరీ బోర్డు బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నితిన్ నబిన్‌ను బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. నియామకం వెంటనే అమలులోకి వస్తుంది" అని పేర్కొన్నారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నవీన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌ను షేర్ చేస్తూ మోదీ.. "నితిన్ నవీన్ కష్టపడి పనిచేసే బీజేపీ కార్యకర్తగా తనను తాను నిరూపించుకున్నారు. ఆయన యువ, అంకితభావంతో పనిచేసే నాయకుడు, సంస్థాగత అనుభవం సంపద కలిగిన వ్యక్తి, బీహార్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పర్యాయాలు అద్భుతమైన రికార్డును సొంతం చేసుకున్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఆయన పూర్తి విధేయత, అంకితభావంతో పనిచేశారు." అని పేర్కొన్నారు. "ఆయన వినయపూర్వకమైన స్వభావానికి, నిక్కచ్చిగా పనిచేసే తత్వానికి నిదర్శనం. రాబోయే సంవత్సరాల్లో ఆయన శక్తి, నిబద్ధత మన పార్టీని మరింత బలోపేతం చేస్తాయని విశ్వసిస్తున్నాను. భారతీయ జనతా పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అయినందుకు ఆయనకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు" అని ప్రధాని అన్నారు. బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బీహార్ కేబినెట్ మంత్రి నితిన్ నబిన్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఆయన, "బిహార్‌కు చెందిన యువ నాయకుడు నితిన్ నబిన్, బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైనందుకు హృదయపూర్వక అభినందనలు. ఆయన కష్టపడి పనిచేసే కార్యకర్త, గొప్ప ఊహాశక్తిగల వ్యక్తి" అని అన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వంలో, ఆయన బీజేపీని కొత్త విజయ శిఖరాలకు తీసుకెళ్లడంలో ఖచ్చితంగా విజయం సాధిస్తారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని కోరుకుంటున్నాను" అని ఆయన అన్నారు. బీహార్ రాష్ట్ర రోడ్డు నిర్మాణ మంత్రి నితిన్ నబిన్ ను బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడం పట్ల బీహార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ అభినందనలు తెలిపారు. "బీహార్ నుండి ఒకరు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులవడం భారతీయ జనతా పార్టీకి చారిత్రాత్మకమైన రోజు. ఇది మాకు, బీహార్ ప్రజలు అందరికీ సంతోషకరమైన విషయం, బీహార్ బీజేపీ తరఫున, బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైనందుకు ఆయనను అభినందిస్తున్నాను" అని ఆయన అన్నారు.

**నితిన్ నబిన్ ఎవరు?**

బీహార్ ప్రభుత్వంలో పీడబ్ల్యూడీ మంత్రిగా ఉన్న నితిన్ నవీన్ కాయస్థ వర్గానికి చెందిన వ్యక్తి. ఈసారి ఆయన బీహార్‌లోని బంకిపూర్ నియోజకవర్గం నుండి ఐదవసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలిసారిగా 2006లో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. తన తండ్రి మరణం తర్వాత, ఆయన రాజకీయ వారసత్వాన్ని చేపట్టారు. ఆ తర్వాత ఆయన 2010, 2015, 2020లలో, ఇప్పుడు మళ్ళీ 2025లో వరుసగా విజయం సాధిస్తూ వస్తున్నారు. ఫిబ్రవరి 9, 2021న నితీష్ కుమార్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ సందర్భంగా రోడ్డు నిర్మాణ మంత్రిగా అవకాశం పొందారు.

# సత్యమనే నినాదంతో.. కేంద్ర సర్కారును గద్దెదించుతాం..

ఈమేరకు ప్రసంగించారు. "తాము దేశం కోసం పనిచేస్తున్నామని, మోదీ కోసం కాదనేది ఎన్నికల సంఘం గుర్తుంచుకోవాలి. బిహార్ ఎన్నికల వేళ భాజపా రూ.10 వేల చొప్పున పంచినా.. ఈసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మరోవైపు.. ఎన్నికల సంఘంపై ఎటువంటి చర్యలకు అవకాశం లేకుండా కేంద్రం ఓ చట్టం తీసుకొచ్చింది. మేం అధికారంలోకి వస్తే దాన్ని మార్చి.. ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటాం. సమయం పట్టినా.. చివరకు సత్యమే గెలుస్తుంది. మోదీ, అమిత్ షాలను ఓడించేందుకు.. సత్యం, అహింస మార్గంలో పోరాడతాం" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**ఆ విషయం దేశం మొత్తానికి తెలుసు : ప్రియాంక గాంధీ**

దేశంలో ఎన్నికలను సక్రమంగా నిర్వహించడం లేదని, అడుగడుగునా అనుమానాలు రేకెత్తుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. బిహార్ ఎన్నికల సమయంలో రూ.10 వేలు ఇవ్వడాన్ని ఈసీ పట్టించుకోలేదని, ఇది ఓటు చోరీ కాదా? అని ప్రశ్నించారు. బిహార్‌లో ఓడిపోయినందుకు నిరుత్సాహపడకూడదని, ఓట్ల చోరీ ద్వారా భాజపా గెలిచిందని దేశం మొత్తానికి తెలుసన్నారు. బ్యాలెట్ విధానంలో ఎన్నికల్లో పోటీ చేయాలంటూ భాజపాకు సవాల్ విసిరారు. దేశంలోని అన్ని సంస్థలను కేంద్రం ముందు లొంగిపోయేలా చేస్తున్నారని, ఈ అణచివేతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

# ప్రధాని కోసం 'అఖండ2' స్పెషల్ షో..

## హైందవ ధర్మం మీసం మెలేసింది: బాలకృష్ణ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సినిమా ఎప్పుడొచ్చిందని కాదు, దాని ప్రభావం సమాజంపై ఎంత ఉందన్నదే ముఖ్యమని అగ్ర కథానాయకుడు బాలకృష్ణ అన్నారు. ప్రకృతి, పిల్లల జోలికొస్తే దేవుడు ఏం చేస్తాడో 'అఖండ'లో చూపించాం. మనిషే దేవుడు అయితే ఎలా ఉంటుందో 'అఖండ2'లో చూపించామని తెలిపారు. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'అఖండ భారత బ్లాక్‌బస్టర్' పేరుతో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు.

**నన్ను చూసుకునే నాకు పొగరు..**

"అందరూ మహానుభావులు కాలేరు. ఒక పని కోసం భగవంతుడు కొంతమందిని ఎంచుకుంటాడు. ఈ సినిమా చూసి, 'సనాతన హైందవ ధర్మం మీసం మెలేసింది' అని అందరూ అంటున్నారు. మంత్రోచ్ఛారణ, వేదం, మన భారత దేశపు మూలాలు, మన ధర్మం, మన గర్వం, మన తేజస్సు కలగలిపిన సినిమా 'అఖండ2'. ఈ మూవీలో ఒక్కో డైలాగ్ ఆణిముత్యం. ప్రతి సన్నివేశం ఒక ఉద్వేగం, ఉత్తేజ ప్రకంపనం. సినిమా ఒక నిత్యావసర వినోదం. అందుకే ఇండస్ట్రీ పెద్దలు ఎలాంటి సినిమాలు తీయాలన్న ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఈ రోజు నాకు గర్వంగా ఉంది. ఇప్పటివరకూ ఐదు సినిమాలు తీశాం. ఆరోది కూడా రాబోతోంది. చరిత్రలో చాలా మంది ఉంటారు. సృష్టించిన చరిత్రను మళ్లీ మళ్లీ తిరగరాసి తిరిగి చరిత్ర సృష్టించే వాడు ఒక్కడే. అది ఒక తెలియని శక్తి. 'ఎవరిని చూసుకుని రా బాలకృష్ణకు అంత పొగరు' అని చాలా మంది అంటారు. నన్ను చూసుకునే నాకు పదునైన పొగరు. నా వ్యక్తిత్వమే నన్ను ఉసిగొలిపే విప్లవం. నన్ను నేను తెలుసుకోవడమే నాకు తెలిసిన గొప్ప విద్య. అంతా ఆ పరమేశ్వరుడి దయ"

**ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు..**

"సినిమా, సంగీతం ద్వారానే నాకు ఉత్సాహం కలుగుతుంది. నా వృత్తే నా దైవం. ఇది తెలుగు సినిమా మాత్రమే కాదు. ఇది ప్రపంచ సినిమా. ఎక్కడ చూసినా యుద్ధాలు, ఆకలి చావులు. మనలో మనం సృష్టించుకున్న విభేదాలు కనపడుతున్నాయి. మనం బ్యాట్‌మ్యాన్, సూపర్ మ్యాన్ గురించి మాట్లాడుకుంటాం. నాన్నగారు చేసిన పౌరాణిక సినిమాలు చూస్తాం. ఇది కూడా అలాంటి సినిమానే. మన దేశంలో ఎంతో మంది గొప్ప వ్యక్తులు ఉన్నారు. విదేశీయులు వాళ్లను తీసుకెళ్లి అభివృద్ధి చెందారు. సినిమా విజయం సాధిస్తే, అది కేవలం నా ఒక్కడి వల్లే వచ్చింది కాదు. ఎంతో మంది కృషి, శ్రమ ఉంది. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ, ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు" బాలకృష్ణ అన్నారు.

**ప్రధాని మోదీ కోసం స్పెషల్ షో: బోయపాటి**

దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. " భారతదేశం ధర్మానికి గ్రంథాలయం. ధర్మానికి తల్లి వేరులాంటిది. దాన్ని నమ్మిన దేశాలు ఒకలా ఉంటే, నమ్మనవి మరోలా ఉన్నాయి. 'ఒక మనిషి అనుకుంటే, గెలవవచ్చు. ఓడవచ్చు. కానీ, దేవుడు అనుకుంటే గెలుపే ఉంటుంది ఆ విజయమే ఈ సినిమా. ఇది దేవుడి సంకల్పం. దాన్ని మీరు అద్భుతంగా ఆదరించారు. అడ్డంకులు వస్తే దేవుడే చూసుకుంటాడు. ఈ విజయానికి కారణమైన ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'అఖండ2'ను 3డీలోనూ తీశాం. అదొక కొత్త అనుభూతిని ఇస్తుంది. అందరూ ప్రయత్నించండి. తమన్ చెప్పినట్లు ప్రతి ఒక్కరూ బాగుండాలి. తెలుగు సినీ పరిశ్రమ అంతా ఒక వేదికపైకి వద్దాం. బయటవాళ్లు చూసి వేరేలా అనుకునేలా చేసుకోవద్దు. త్వరలో దిల్లీలో అఖండ2 ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నాం. అఖండ2 షోను ప్రధాని మోదీ చూడబోతున్నారు" అని అన్నారు.

## భాజపా కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్
# నితిన్ నబీన్‌కు అభినందనలు : పవన్ కల్యాణ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** భాజపా కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబీన్‌కు ఏపీ డిప్యూటీసీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. "భాజపా యువజన విభాగంలో నితిన్ నబీన్ సేవలందించారు. బిహార్ రాజకీయాల్లో, ప్రజా జీవితంలో క్రియాశీలకంగా ఉన్నారు. ఎన్డీయేను.. మోదీ, అమిత్ షా, నడ్డా బలోపేతం చేశారు. అగ్రనేతల స్ఫూర్తిని బలంగా ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షిస్తున్నా" అని ఓ ప్రకటనలో తెలిపారు.

## మదనపల్లెలో వాజ్‌పేయీ విగ్రహాన్ని
# ఆవిష్కరించిన ఉత్తరాఖండ్ సీఎం



**మదనపల్లె, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పర్యటించారు. పట్టణంలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద పుష్కర్‌సింగ్ ధామీకి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ తదితరులు ఉన్నారు. మదనపల్లెలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఉత్తరాఖండ్ సీఎం పాల్గొననున్నారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com



# ఏపీలో బంగారు గనులు..

**కర్నూలు జిల్లా జొన్నగిరిలో మొదలైన బంగారు గనుల తవ్వకాలు - జియో మైసూర్ సంస్థ ఆధ్వర్యంలో పసిడి వెలికితీత పనులు**

**టన్ను మట్టి నుంచి 2 గ్రాముల వరకు బంగారం ఉత్పత్తి అంచన - పదేళ్లలో 6 వేల టన్నుల బంగారం ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ**



**జొన్నగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ, సామాన్యులకు ఒక ఆశాజనకమైన వార్త. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో బంగారు గనుల తవ్వకాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ దేశీయ ఉత్పత్తి భవిష్యత్తులో పసిడి ధరలను అదుపులోకి తీసుకురావచ్చని నిపుణులు భావిస్తున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో ఈ తవ్వకాలను 'జియో మైసూర్' అనే సంస్థ చేపట్టింది. జొన్నగిరి, పగిడిరాయి గ్రామాల పరిసర ప్రాంతాల్లో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) కొన్నేళ్ల క్రితమే నిర్ధారించింది. దీంతో ప్రభుత్వం సుమారు 1,477 ఎకరాల్లో తవ్వకాలు జరిపేందుకు జియో మైసూర్ కంపెనీకి అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇక్కడ పనులు వేగంగా సాగుతున్నాయి. అధికారుల అంచనా ప్రకారం ఈ ప్రాంతంలో ఒక టన్ను మట్టిని శుద్ధి చేస్తే 1.5 నుంచి 2 గ్రాముల వరకు బంగారం లభించే అవకాశం ఉంది. ఇందుకు సుమారు రూ. 5 వేల వరకు ఖర్చవుతుందని తెలుస్తోంది. మరోవైపు, వెయ్యి టన్నుల ముడి ఖనిజం నుంచి 700 గ్రాముల బంగారాన్ని వెలికితీయడం సాధ్యమవుతుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రానున్న పదేళ్లలో సుమారు 6 వేల టన్నుల బంగారం ఉత్పత్తి చేయాలని జియో మైసూర్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాంతంలో దాదాపు కోటి టన్నుల ఖనిజ నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తూర్పు బ్లాక్‌లో భూమికి 180 మీటర్ల లోతున 6.8 టన్నుల పసిడి ఖనిజం ఉన్నట్లు గుర్తించారు. ఇందుకోసం అధునాతన యంత్రాలను వినియోగిస్తూ, రోజుకు 1000 టన్నుల ఖనిజాన్ని శుద్ధి చేస్తున్నారు.

పంట పొలాలను తినేస్తున్న

# పాడి గేదెల రైతులపై చర్యలు తీసుకోవాలి





**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, దేవీ పట్నం మండలం పరిధిలోని దేవారం, పోతవరం, చిన్నారి గండి, పోతుకొండ మొదలైన గ్రామాలలో ఆదివాసీ రైతులు పండిస్తున్న వరి, మొక్కజొన్న,వంగ మొదలైన మా పంటలను పంట వేసిన నాటినుండి పంట చేతికొచ్చే దశ వరకు ప్రతిరోజు అర్ధరాత్రి సమయంలో పోలవరం ముంపు గ్రామాలైన ఆర్ అండ్ ఆర్ కాలనీలలో కొంతమంది రైతులకు పాడి గేదెలు ఉన్నాయన్నారు. ఈ పాడి గేదెలను దండంగి వాగుకి సమీపంలో మేపుకొని సాయంత్రం పాలు తీసుకొని అక్కడే పాడి గేదెలను కట్టేయడం జరుగుతుందన్నారు.కట్టేసిన పాడి గేదెలలో కొన్ని తాళ్లు తెంపుకొని వచ్చి గత రెండు మూడు సంవత్సరాల నుండి పంటలు నాశనం చేస్తున్నాయని ఇలా ఇడివడి పంటను నాశనం చేసిన పాడి గేదెలను గ్రామంలోకి తోలుకొచ్చి కట్టేసి సంబంధిత పాడి గేదెల రైతులకు గ్రామ పెద్దలు,రైతులు ఎన్నోసార్లు చెప్పినప్పటికీ అర్ధరాత్రి సమయంలో పాడి గేదెలు వచ్చి మా పంటలను తినేస్తున్నాయని పోతవరం,దేవారం,చిన్నారి గండి,పోతుకొండ సంబంధిత గ్రామాల రైతులు ఏపీ ఆదివాసీ జేఏసీ వైస్ చైర్మన్ తెల్లం శేఖర్,భారత్ ఆదివాసీ పార్టీ దేవీపట్నం మండల అధ్యక్షులు చవలం విద్యాసాగర్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్,చవలం విద్యాసాగర్ మాట్లాడుతూ దేవీపట్నం మండలంలోని తాసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారి,పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సంబంధిత అధికార్లు స్పందించి దేవీపట్నం మండలంలోని పోలవరం ముంపు గ్రామాలలో కొంతమంది రైతులు దండంగి వాగు సమీపంలో పాడి గేదెలు సాయంత్రం సమయంలో కట్టేసి వస్తున్న పాడి రైతులతో మాట్లాడి మరల పునరావతం కాకుండా పాడి గేదెలు పంటలు నాశనం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్,భారత్ ఆదివాసీ పార్టీ దేవీ పట్నం మండల అధ్యక్షులు చవలం విద్యాసాగర్ సంబంధిత రైతులకు మరియు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రెస్ క్లబ్ ఎన్నికలపై

# కలెక్టర్‌ను కలవనున్న జర్నలిస్టులు

**వినతిపత్రం ఇచ్చిన తర్వాత తదుపతి కార్యాచరణ సిద్ధం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికలు మరియు అడిట్ నిర్వహించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కీర్తీ చేకూరికి పాత్రికేయులు సమక్షంలో వినతిపత్రం అందజేయనున్నట్లు జె.ఏ.సి. చైర్మన్ సిహెచ్ రాజు, జె.ఏ.సి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్పీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ సోమవారం నిర్వహించు స్పందన (గ్రీవెన్స్) లో జె.ఏ.సి ఆధ్వర్యంలో సుమారు 40మంది పాత్రికేయులు కలెక్టర్ కార్యక్రమానికి చెరుకు వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రెస్ క్లబ్ సభ్యత్వాలకు అతీతంగా ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ముందుకు సాగుతున్న తమకు అధిక సంఖ్యలో పాత్రికేయులు మద్దతు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులు అందరు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

# కూచిపూడి కళాక్షేత్రంలో విద్యార్థులకు మంచి భవిష్యత్

**నాట్యం పోటిల్లో ద్వితీయ స్థానం గెలుచుకున్న అభి, కిరణ్మయిలు**




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ స్వర నర్తన సంస్థ వారి ఆధ్వర్యంలో ఏపి స్టేట్ క్రియేటివిటి అండ్ కల్చర్ కమిషన్ మరియు ఆంధ్ర నాట్య సంగమమ్ సంయుక్త సారద్యంగా నిర్వహించిన కూచిపూడి పోటిల్లో శ్రీ శివసాయి కూచిపూడి కళా క్షేత్రం నిర్వకురాలు తణుకు సాయి మాధవి విద్యార్థులు అభి, కిరణ్మయి, తేజా, హాస్య, ఐశ్వర్యలు పాల్గొని ద్వితీయ స్థాన్నాన్ని గెలుచుకున్నారు.ఎందరో ప్రసిద్ధి చెందిన కూచిపూడి నృత్యకారిణిలు పాల్గొన్న ఈ పోటిల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న సాయి మాదవి విద్యార్థిణులు అభి, కీరణ్మయి, తేజ, హాసిని, ఐశ్వర్య లను పలువురు గురువులు అభినందించారు. కూచిపూడి పితామహులు చంద్రశేఖర్ మాష్టారు, పద్మ మోహన్ మేడమ్ వార్లు అభిని ప్రత్యేకంగా అభినందించి ఆశీర్వదించారు. శ్రీ శివ సాయి కూచిపూడి కళా క్షేత్రం విద్యార్థులకు మంచి భవిష్యత్ వుందని కితాబులిచ్చారు. ఈ పోటిల్లో వారి ప్రతిభను చాటుకున్న అభి, కిరణ్మయి, తేజ, హాస్య, ఐశ్వర్య లను సాహితీ నగరం రాజమండ్రికి ఎనలేని కీర్తిని దక్కించారాని, పవిత్ర హిందూ ధర్మ మూలలకు ఈ చిరంజీవులు మార్గదర్శకులుగా నిలుస్తారని హిందూ ధర్మ రక్షణ సమితి నిర్వహికులు (హెచ్‌డిఆర్‌ఎస్) వారి ప్రతిభను కొనియాడారు.

నూతన వ్యవసాయ మార్కెటింగ్ అధ్యక్షులకు

# అవగాహన సదస్సు : విజయ సునీత




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం రీజియన్ పరిధిలో ఇటీవల నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెటింగ్ అధ్యక్షులకు వ్యవసాయ మార్కెటింగ్ విధి విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ఆదివారం విశాఖపట్నం రీజియన్ పరిధిలో నూతన అధ్యక్షులకు పరిపాలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గ వ్యవసాయ మార్కెటింగ్ అధ్యక్షురాలు తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి రైతుల పొలాలకు లింకు రోడ్లు, వివిధ మండలాల్లో రైతులు తాము పండించిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి మార్కెట్లు ఏర్పాటు, వ్యవసాయం మార్కెటింగ్ బిల్డింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయవలసిందిగా వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్ నందు

# యధావిధిగా అర్జీల స్వీకరణ

**జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 15వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా విన తుల స్వీకరణ కార్యక్రమం యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు ఈనెల 15వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం ద్వారా అర్జీదారుల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీ అర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపారు.జిల్లా కలెక్టరేట్, డివిజన్, మునిసివల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధి కారులు అర్జీదారులకు అందుబాటులో ఉండి అర్జీ లు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను మీకోసం. ఏ పి.జి ఓ వి.ఇన్ వెబ్సైట్ నందు సమోదు. చేసుకోవచ్చునని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చునని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

అమలాపురంలో

# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

**కౌన్సిలింగ్‌కి ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.శాజిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించడం.రౌడీ షీటర్లు పాత నేర చరిత్రను విడిచిపెట్టి, మంచి జీవనం గడిపేలా వారికి మార్గనిర్దేశం చేయడం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా హెచ్చరించడం.నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని వారికి సూచించడం. ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ, "జిల్లాలో ఎలాంటి అసాంఘీక శక్తులు, రౌడీయిజం, గూండాయిజంలకు తావు లేకుండా చూస్తాము. నేరాలకు పాల్పడే వారిపై, పాత నేరాలను పునరావృతం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోము. ఈ కౌన్సిలింగ్ ద్వారా వారు తమ ప్రవర్తనను మార్చుకుంటారని ఆశిస్తున్నాము,అని తెలిపారు.

వైసీపీ పెద్దాయనకు

# రెండు టికెట్లు కావాలంట..?



ఇక చూస్తే మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అయితే చాలా కాలంగా సైలెంట్ గా ఉంటూ వస్తున్నారు. ఆయనను కదిలించాలని ఎంత మంది చూసినా కూడా ఏమీ చేయలేకపోయారు.

వైసీపీలో ఇపుడు మెల్లగా ఒక్కొక్కరూ బయటకు వస్తున్నారు. తమ గొంతుని మీడియా ముందు గట్టిగా విప్పుతున్నారు. ఏణ్ణర్థం కాలం గడచిపోయింది చివరి ఏణ్ణర్థం ఎన్నికల కోసం వదిలేస్తే ఇక మిగిలింది రెండేళ్ళు కాబట్టి ఇప్పటి నుంచే జనంలో ఉండాలని భావిస్తున్నారని అంటున్నారు. దాని కంటే ముందు మీడియా ద్వారా కూటమి ప్రభుత్వం మీద విరుచుకుపడడం ద్వారా అధినేత మెప్పు పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా విషయానికి వస్తే ధర్మాన సోదరులకే పెద్ద పీట అన్నది తెలిసిందే. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, క్రిష్ణదాస్ లేకుండా వైసీపీ అన్నదే లేదు అని అంటారు. అందుకే వారికి అంతగా ప్రయారిటీ కూడా పార్టీలో ఉంది.

**సైలెంట్ నుంచి బిగ్ సౌండ్ :**

ఇక చూస్తే మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అయితే చాలా కాలంగా సైలెంట్ గా ఉంటూ వస్తున్నారు. ఆయనను కదిలించాలని ఎంత మంది చూసినా కూడా ఏమీ చేయలేకపోయారు. ఆయన అప్పట్లో వేరే ఆలోచనలు చేస్తున్నారు అని కూడా టాక్ నడచింది. ఇక శ్రీకాకుళం అసెంబ్లీ సీటు కి వేరే ఇంచార్జిని నియమిస్తారని కూడా ఒక దశలో ప్రచారం కూడా జరిగింది. అయితే వైసీపీ హైకమాండ్ ప్రసాదరావుకే ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. ఆయన మళ్ళీ క్రియాశీలకం కావాలని కోరుతూ వచ్చింది. దాంతో ఇటీవల కాలంలో ప్రసాదరావు మళ్ళీ మీడియా ముందుకు వస్తున్నారు. తాజాగా ఆయన మీడియా ముందుకు వచ్చి బిగ్ సౌండ్ చేశారు.

జగన్ గ్రేట్ అంటూ : జగన్ పాలన భేష్ అని ధర్మాన ప్రసాదరావు చెప్పుకొచ్చారు. జగన్ అధికారంలోకి వచ్చాకనే భూ సర్వేని పకడ్బందీగా ఏపీ అంతటా చేపట్టారని పేదల భూములకు హక్కులు కల్పించింది జగన్ మాత్రమే అన్నారు అలాంటిది ఆయన మీద నిందలు వేసి కూటమి అధికారంలోకి వచ్చిందని ధర్మాన విమర్శించారు. రెవిన్యూ లో అనేక సమస్యలను పరిష్కరించిన ఘనత అయితే జగన్ దే అని చెప్పారు. ఈ విషయంలో డిబేట్ కి కూడా తాను కూటమి నేతలతో రెడీ అన్నారు.

**పోటీకి రెడీనా :**

ఇదిలా ఉంటే ధర్మాన ప్రసాదరావు వచ్చే ఎన్నికల్లో పోటీకి రెడీ అవుతున్నారు అని అంటున్నారు. ఆయన ఈసారి శ్రీకాకుళం ఎంపీ సీటుకు పోటీ చేస్తారు అని వినిపిస్తోంది. తన కుమారుడిని శ్రీకాకుళం అసెంబ్లీ సీటు నుంచి పోటీ చేయించాలని చూస్తున్నారు. ఆ విధంగా రెండు టికెట్లను ఆయన ఆశిస్తున్నారు. అనేక సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి మంత్రిగా పలు కీలక శాఖలను చూసిన ప్రసాదరావుకు పార్లమెంట్ లో కూడా అడుగుపెట్టాలని కోరిక ఉందని చెబుతున్నారు. దానిని వచ్చే ఎన్నికల్లో తీర్చుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. వైసీపీకి శ్రీకాకుళం ఎంపీ సీటుకు అభ్యర్థి కావాల్సి ఉంది. ప్రతీ ఎన్నికల్లోనూ మిస్ ఫైర్ అవుతోంది. దాంతో బలమైన నేతగా అనుభవం ఉన్న వారిగా ప్రసాదరావు వస్తే కనుక కచ్చితంగా వైసీపీకి అభ్యంతరం ఉండకపోవచ్చు, మరి రెండు టికెట్లు అయితే ఆ ఫ్యామిలీకి ఇస్తారా అన్నదే చర్చగా ఉంది. ఏది ఏమైనా ప్రసాదరావు మళ్ళీ ఫుల్ యాక్టీవ్ కావడం పట్ల క్యాడర్ అయితే హుషార్ గా ఉందని అంటున్నారు.

# నేడు శంషాబాద్‌లోని కన్హా శాంతివనానికి సీఎం చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో ఉన్న కన్హా శాంతి వనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు సందర్శించనున్నారు. రేపు ఉదయం జూబ్లిహిల్స్ లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి వెళ్లనున్న సీఎం 11 గంటలకు కన్హా శాంతివనం చేరుకోనున్నారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దాజీ తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్ నెస్ , మెడిటేషన్ సెంటర్ సహా, యోగా కేంద్రాలను ముఖ్యమంత్రి తిలకించనున్నారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్టిఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ ను సీఎం సందర్శిస్తారు. అనంతరం శాంతివనం వ్యవస్థాపకులు దాజీ నివాసానికి వెళ్లనున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతి వనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్ ను ఈ ఆశ్రమం కలిగి ఉంది. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. మానవ వనరుల్ని గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షులు దాజీ నేతృత్వంలో హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లీడర్షిప్ ఈ ఆశ్రమం నిర్వహిస్తోంది. కౌశలం పేరిట శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. కన్హా శాంతివనంలోని యోగా, మెడిటేషన్, వెల్ నెస్ సెంటర్లతో పాటు సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్ని ను కూడా ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్లో బయల్దేరి అమరావతికి తిరిగి రానున్నారు. మధ్యాహ్నం సచివాలయంలో అధికారులతో వేర్వేరు సమీక్షల్లో పాల్గొనున్నారు. రేపు సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమానికి హాజరు కానున్నారు.

# ఎన్నికల్లో పోటీపై నాగబాబు సంచలన నిర్ణయం

మెగా బ్రదర్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం 2031 మార్చి 30 దాకా ఉంటుంది. అంటే శాసనమండలిలో నాగబాబు 2029 తరువాత కూడా కొనసాగుతారు అన్న మాట. ఇక 2029 ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తారా అన్నది ఒక చర్చగా ఉంది. అలా ఎందుకు అంటే నాగబాబు ఏ జిల్లాకు వెళ్ళినా అక్కడ ఒక సీటు చూసుకుని పోటీకి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు అని పెద్ద ఎత్తున ప్రచారం సాగడమే దానికి కారణం.



**అనుకుంటే ఓకే :**

నిజానికి నాగబాబు జనసేన పార్టీ నిర్మాణంలో కానీ పటిష్టం చేయడంలో కానీ ఎంతో కృషి చేశారు. ఆయన తెర వెనక నుంచి చేసిన సేవ చాలా ఎక్కువ అని చెబుతారు. మెగా అభిమానులకు ఒక త్రాటి మీదకు తీసుకుని రావడం కానీ ఎప్పటికపుడు క్యాడర్ తో సమావేశాలు పెడుతూ వారికి చేరువలో పార్టీ ఉండేలా చేయడంలో కానీ నాగబాబు పోషించిన పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. అలాంటి నాగబాబు కనుక అనుకుంటే పోటీకి ఇబ్బంది ఉండదు, నిజానికి ఆయన 2019లో నరసాపురం ఎంపీ సీటుకు పోటీ చేసి రెండు ప్రధాన పార్టీల మధ్య నిలిచి కూడా లక్షలలో ఓట్లు కొల్లగొట్టారు అన్నది అంతా గుర్తు చేసుకోవాలి.

**శ్రీకాకుళం నుంచి :**

ఇక ఈ మధ్యనే నాగబాబు శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వెళ్లారు. అక్కడ ఎచ్చెర్ల శ్రీకాకుళం అసెంబ్లీ స్థానాల పరిధిలో ఆయన క్యాడర్ తో కలసి తిరిగారు. దాంతో ఒక ప్రచారం అయితే స్టార్ట్ అయిపోయింది. నాగబాబు వచ్చే ఎన్నికల్లో ఈ రెండు సీట్లలో ఏదో ఒక దానిని ఎంచుకుని పోటీ చేస్తారు అని. కూటమిలో కూడా ఇది ఒక చర్చకు దారి తీసింది అని అంటున్నారు. శ్రీకాకుళం జిల్లా రాజకీయాలను కింజరాపు కుటుంబం శాసిస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడకు వెళ్ళి నాగబాబు పోటీ అంటే కూటమిలో ఇబ్బందులు వస్తాయని ప్రచారం కూడా చేశారు. అయితే నాగబాబు ఈ విషయంలో ఏమీ మాట్లాడింది కూడా లేదు.

**నో అంటున్న నాగబాబు :**

ఇక తాజాగా నాగబాబు మరోసారి ఉత్తరాంధ్ర జిల్లాలలో పర్యటించారు. ఆయన విశాఖలో పార్టీ క్యాడర్ ని ఉద్దేశించి ఏ ఎన్నిక అయినా పోటీకి క్యాడర్ అంతా సిద్ధంగా ఉండాలని దిశా నిర్దేశం చేశారు. ఇదే సందర్భంలో నాగబాబు ఎన్నికల్లో పోటీ చేసే విషయం చర్చకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఆయన తన సన్నిహితులు అయిన వారితో మాట్లాడుతూ తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది లేదని చెప్పారని అంటున్నారు. నిజానికి నాగబాబుని ఉత్తరాంధ్ర జిల్లాలలో పోటీ చేయమని జనసేన అభిమానులు కోరుతున్నారు అని కూడా ప్రచారం సాగుతోంది. కానీ నాగబాబు మాత్రం తాను పోటీకి దూరం అని అంటున్నారు.

**పార్టీ సేవకే ఇక :**

రానున్న కాలం అంతా తాను పార్టీ సేవకే అంకితం అవుతాను అని నాగబాబు చెబుతున్నట్లుగా అంటున్నారు. నాగబాబు వచ్చే ఎన్నికల నాటికి ఏడు పదుల వయసు కి వస్తారు అని అంటున్నారు. అంతే కాదు ఆరోగ్యపరంగా కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని కూడా అంటున్నారు ఇంకో వైపు అందరూ పోటీలో ఉంటే పార్టీకి పనిచేసే వారు కూడా ఉండాలి కదా అన్నది ఉంది. మెగా అభిమానులతో పార్టీ గ్రౌండ్ లెవెల్ క్యాడర్ తో నిరంతరం అందుబాటులో ఉండే నాగబాబు పార్టీకే ఎపుడూ ఓటేస్తారు అని అంటున్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి కూడా ఉంది. దాంతో 2029 నాటికి జనసేన అభ్యర్థులు అంతటా విజయం సాధించేలా ఆయన అన్ని జిల్లాలలో తిరిగి పార్టీని బలోపేతం చేసే పనిలో ఉంటారని చెబుతున్నారు.

**చాన్స్ అలా ఉందా :**

ఇక నాగబాబు ప్రస్తుతానికి ఈ నిర్ణయం తీసుకున్నా పార్టీ కనుక కోరితే పోటీకి సైతం రెడీ అని అంటున్నారు. ఆయనకు నిజానికి 2024 ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేయాలని ఉండేది కానీ పొత్తుల కోసం దానికి వదులుకుని అనకాపల్లి ఎంపీ సీటుకు షిఫ్ట్ అయ్యారు. అయితే చివరి నిముషంలో ఆ సీటుని బీజేపీకి ఇవ్వడంతో నాగబాబు పూర్తిగా పోటీ నుంచి తప్పుకున్నారు. ఈసారి జనసేన ఎక్కువ సీట్లు కోరవచ్చు. దాంతో ఏమైనా అవసరం పడితే నాగబాబు పోటీకి సైతం అప్పటి పరిస్థితుల బట్టి సిద్ధంగా ఉంటారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# అక్కడంతే..

## గెలిచింది టీడీపీ.. అధికారం వైసీపీదా.. ?




ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రెండు కీలక నియోజకవర్గాల్లో వైసిపి మాటే నెగ్గుతోందా? అంటే.. ఔననే అంటున్నారు టీడీపీ నేతలు. రెండు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నియోజకవర్గాలలో వైసిపి నే ప్రధానంగా ఇంకా చక్రం తిప్పుతోందన్న చర్చ నడుస్తుండడం విశేషం. చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు అదేవిధంగా గంగాధర నెల్లూరు ఈ రెండు నియోజకవర్గాలు ఎస్సీ సామాజిక వర్గం పరిధిలో ఉన్నాయి. గత ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గం నుంచి మురళీమోహన్ టిడిపి తరఫున విజయం దక్కించుకున్నారు. అదేవిధంగా గంగాధర నెల్లూరు నుంచి థామస్ విజయం సాధించారు. వీరిద్దరూ కొత్త నాయకులు కావడం తొలిసారి విజయం దక్కించుకున్న నేపథ్యంలో వీరుపై పార్టీ చాలా ఆశలు పెట్టుకుంది. వచ్చే ఎన్నికలనాటికి మరింత బలంగా పార్టీని విస్తరించాలని కూడా భావించింది. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో కూడా వైసిపి నాయకులు చక్రం తిప్పుతున్నారు అన్నది రాజకీయంగా వినిపిస్తున్న మాట. పూతలపాటి నియోజకవర్గంలో ఎంఎస్ బాబు గంగాధర నెల్లూరులో మంత్రి నారాయణస్వామి మాటే పై చేయిగా ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది కూడా టిడిపి నాయకుల కంటే కూడా వైసిపి నేతలకు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నారు అన్న చర్చకు వచ్చింది. ఈ విషయంలో పార్టీకి కూడా సమాచారం అందింది. క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు పర్యటిస్తున్నా ప్రజలతో మమేకమవుతున్నా ఈ పరిస్థితులు ఉండవన్నది తరచుగా చంద్రబాబు చెప్తున్నారు. కానీ ఈ రెండు నియోజకవర్గాల్లో పరిస్థితులు మాత్రం దీనికి భిన్నంగా ఉన్నాయి. వాస్తవానికి గంగాధర్ నెల్లూరులో థామస్ పర్యటిస్తున్నారు. అయితే ఆయన వైసీపీ నాయకులతో కలిసి పని చేస్తుండడం కొన్నాళ్ల కిందట వివాదంగా మారింది. ఇక పూతలపట్టు నియోజకవర్గంలో మురళీమోహన్ కూడా ప్రజల మధ్య ఉంటున్నారు. కానీ, ఇక్కడ కూడా ఎమ్మెస్ బాబు వర్గానికి ఎక్కువ ప్రాధాన్య ఇస్తుండడం ముఖ్యంగా అధికారులు కూడా ఆయన చెప్పినట్టు పనిచేస్తున్నారు అన్న వాదన వినిపిస్తోంది. దీనికి సంబంధించి ఇటీవల జనసేన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడం విశేషం. టిడిపి నాయకుల పరిస్థితి ఎలా ఉన్నా.. జనసేన చిత్తూరు జిల్లాలో పరిస్థితి బాగోలేదని చెప్పింది. అధికారులు తమ మాట వినడం లేదని కూడా చెప్పుకు వచ్చారు ఈ పరిస్థితులు మార్చకపోతే వచ్చే ఎన్నికల నాటికి తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని కూడా వారు వెల్లడించడం విశేషం. మరి దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ఏ విధంగా ముందుకు సాగుతారు అన్నది చూడాలి. వాస్తవానికి వైసిపి అధికారం కోల్పోయినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు కూడా హెచ్చరిస్తున్నారు. ఇతర పార్టీల నాయకులతో కలిసి అడుగులు వెయ్యొద్దు అని కూడా చెబుతున్నారు. అయినా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం ఈ పరిస్థితి ఉండడం విశేషం. అయితే దీనికి అధికారంలో ఉన్న టిడిపి నాయకులు చెబుతున్న మాట భిన్నంగా ఉంది. గత ఎన్నికల్లో వైసీపీ నాయకులు కొంత కలిసి వచ్చారని అంతర్గతంగా తమకు హెల్ప్ చేశారని చెబుతున్నారు. మరి దీనిలో ఎంత నిజం ఉంది. ఏంటి అనేది చూడాలి. ఏదేమైనా ప్రస్తుతం పూతలపట్టు, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల్లో జరుగుతున్న రాజకీయాలు చర్చనీయాంసంగా మారాయి.

# ఆ ఓటు బ్యాంకుపై బీజేపీ దృష్టి..!

ఏపీలో బీజేపీ పుంజుకోవాలి. బలమైన శక్తిగా కూడా ఎదగాలి. – ఇదీ.. జాతీయ బీజేపీ నాయకత్వం పెట్టుకు న్న లక్ష్యం. ఈ లక్ష్య సాధన కోసం ఇప్పటి వరకు అనేక ప్రయత్నాలు సాగాయి. కాపు సామాజిక వర్గాన్ని తనవైపు తిప్పుకొనేందుకు సోము వీర్రాజు, కన్నా లక్ష్మీనారాయణ వంటివారికి రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్ప గించారు. కానీ.. అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఇక, ఆ తర్వాత కమ్మ సామాజిక వర్గంతో కలుపుగోలు కోసం పురందేశ్వరికి కూడా పగ్గాలు అప్పగించారు. కూటమి కట్టడంలోనూ.. గత ఎన్నికల్లో విజయం దక్కించుకునే విషయంలోనూ ఆమెసక్సెస్ అయ్యారు.



అయితే.. ఇది చాలదన్నది పార్టీ జాతీయ నాయకత్వం చెబుతున్నమాట. ఈ క్రమంలోనే ప్రత్యేక దృష్టి పెట్టారు. కూటమిలో కలివిడిగా ఉంటూనే వ్యక్తిగతంగా పార్టీని డెవలప్ చేయాలని భావిస్తున్నారు. తాజాగా ఇదే విషయంపై రాష్ట్ర నాయకత్వం కూడా కసరత్తును ముమ్మరం చేసింది. ఈ క్రమంలో తటస్థ ఓటు బ్యాంకును చేరువ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం కులాలు, సామాజిక వర్గాల ఆధారంగా ఓటు బ్యాంకు కొన్ని పార్టీలకు పరిమితం అయింది. వైసీపీకి రెడ్డి ఓటు బ్యాంకు.. పదిలం అనుకున్నా.. కొంత గ్యాప్ వచ్చింది. ఈ గ్యాప్‌ను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఇక, ఎస్సీ ఓటు బ్యాంకు కూడా వైసీపీకి అనుకూలంగా ఉంది. భారీ కూటమి హవాలోనూ ఎస్సీనియోజకవర్గాల్లో వైసీపీ పట్టు సాధించింది. గెలిచినా గెలవకపోయి నా.. మెజారిటీ ఓట్లను దక్కించుకుంది. ఇక, ఎస్టీ ఓటు బ్యాంకు కూడా ఆ పార్టీకి అనుకూలంగానే ఉంది. ఈ నేపథ్యంలో మధ్యే మార్గంగా తటస్థ ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీనిలో విద్యా వం తులు, మేధావులు...విద్యార్థి ఓటు బ్యాంకుపై దృష్టి పెడుతోంది. ఇది ఏ పార్టీకి ఇబ్బంది కరంగా మారుతుందనే చర్చ తెరమీదికి వస్తోంది. కూటమికూడా కొంత మేరకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నా.. మెజారిటీగా వైసీపీ ఓటు బ్యాంకుకు పెద్ద ఎత్తున నష్టం వచ్చే ఛాన్స్ కనిపిస్తోందని చెబుతున్నారు. అదేసమయంలో బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు ఏర్పడుతుందా? అంటే.. ఇప్పటికిప్పుడు చెప్పే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

# వైసీపీకి బీజేపీ డిస్టెన్స్... రీజన్ ఇదే...!






వైసీపీ భవిష్యత్తు ప్రణాళికలు ఏంటి? ఆ పార్టీ ఎలా పుంజుకుంటుంది? ఏ విధంగా రాజకీయంగా అడుగులు వేస్తుంది? ఈ ప్రశ్నలు.. ఎవరో కాదు.. బీజేపీ పెద్దలే ఆరా తీసినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఏపీ, తెలంగాణ రాజకీయాల గురించి ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల ఎంపీలతో చర్చిం చారు. అయితే. కేవలం ఆయన కూటమి, బీజేపీల రాజకీయాల గురించే కాకుండా.. వైసీపీ రాజకీయాల గురించిన కూడా ఆరా తీసినట్టు తెలిసింది. ఆ పార్టీ ఏ విధంగా ఉంది? ఏం చేస్తోంది? అనే విషయాలపై బీజేపీ దృష్టి పెట్టింది. నిజానికి బీజేపీ కూటముల విషయంలో అనుసరించే వ్యూహాలు భిన్నంగా ఉంటాయి. ఏ రాష్ట్రంలో అయి నా.. ఏ పార్టీతోనూ నికరంగా కలిసి ఉండే పరిస్థితి బీజేపీకి లేదు. 2024 ఎన్నికలకు ముందు.. కూడా ఏపీలో ఇలాంటి సందిగ్ధత కనిపించింది. కూటమికట్టినా.టీడీపీ విషయంలో ఆచి తూచి అడుగులు వేశారు. అం దుకే సూపర్ సిక్స్ మేనిఫెస్టో ప్రకటన సమయంలో బీజేపీ నాయకులు ఎవరూ పట్టించుకోలేదు. ప్రచారం కూడా చేయలేదు. ఇటీవల కొన్ని నెలలుగా మాత్రమే సూపర్ సిక్స్ గురించి చెబుతున్నారు. సో.. బీజేపీ ఎక్కడైనా అలానే ఉంటుంది. ఏ పార్టీనీ దూరం చేసుకుని.. రాజకీయాలు చేయదు. తద్వారా.. తాను ఎదిగేందుకు ప్రాధాన్యం ఇస్తుంది. అలానే ఏపీలోనూ సావకాశాలు చూసుకుంటుంది. అయితే.. టీడీపీ.. లేకపోతే.. వైసీపీతో పరోక్షంగా కలిసి రాజకీయాలు చేసిన సంస్కృతి కూడా ఉంది. ఈ నేపథ్యం లోనే వైసీపీ పరిస్థితిని తెలుసుకున్న బీజేపీ పెద్దలు.. ప్రస్తుత కూటమికే మొగ్గు చూపారు. వైసీపీ పరిస్థితిలో మార్పులేదని, రాలేదని తెలుసుకున్న తర్వాత.. కూటమికి బలంగా ఉండాలని నిర్ణయించారు. ఆది నుంచి వైసీపీని జగన్ నడిపిస్తున్నా.. ఆయన సలహాదారులపైనా.. ఐప్యాక్ వంటి వ్యూహాత్మక రాజకీ యాలు చేసే వారిపైనే ఆధారపడుతూ వచ్చింది. ఇది మంచి చెడుల మిశ్రమంగా ఉంది. పైగా.. సిద్ధాంతం అంటూ.. ప్రత్యేకంగా ఏమీ లేదు. ఇప్పుడు కూడా పార్టీ పరిస్థితి అలానే ఉంది. దీనిని గమనించే బీజేపీ కీలక స్టాండు తీసుకుంది. ఇక,ఇప్పుడున్న పరిస్థితిలోనూ అదే తరహా రాజకీయాలు చేసేందుకు వైసీపీ మొగ్గు చూపుతోంది. రాజకీయ వ్యూహకర్తల కోసం వెతుకుతున్నట్టు తెలిసింది. అందుకే.. బీజేపీడిస్టెన్సు పాటిస్తోంది.

# బాలినేనికి ఎమ్మెల్సీ.. ఏం జరిగింది ..!

సీనియర్ పొలిటీషియన్ ఒంగోలు మాజీ ఎమ్మెల్యే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం జనసేనలో ఉన్నారు. అయితే ఆయనకు పెద్దగా ప్రాధాన్యం అయితే లభించడం లేదు. గత ఎన్నికలకు ముందు వైసీపీ తరపున పోటీ చేసిన బాలినేని శ్రీనివాస్ రెడ్డి అనంతరం ఆ పార్టీతో విభేదించి బయటకు వచ్చారు. జనసేన కండువా కప్పుకున్నారు. కానీ బాలినేని పై ఇటు జనసేన అటు టిడిపి నాయకుల్లో కూడా తీవ్రమైన వ్యతిరేకత కొనసాగుతోంది. దీనిని తగ్గించేందుకు బాలినేని ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు నాయకులు ఆయనపై వ్యతిరేక ప్రచారం అదేవిధంగా పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటివి తరచుగా చర్చకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో భేటీ అయ్యారు. పార్టీలో తనకు ప్రాధాన్యం పెంచడం తో పాటుగా... ఎమ్మెల్సీ పదవిపై కూడా ఆయన చర్చించినట్లు తెలిసింది. వాస్తవానికి గతంలోనే బాలినేనికి ఎమ్మెల్సీ ఆఫర్ చేశారన్న వాదన తెరమీదకు వచ్చినప్పుడు ఆయన వద్దన్నట్టుగా వార్తలు వచ్చాయి. తన స్థాయికి తగదని ఆయన వ్యాఖ్యానించినట్టు జనసేన వర్గాలు కూడా చెప్పాయి. కానీ, ఇప్పుడు పదవి లేకపోవడంతో తనకు ఎలాంటి ప్రాధాన్యం లభించడం లేదని, పార్టీలోనూ అదేవిధంగా వ్యక్తిగతంగా కూడా తనకు ఇబ్బందికర పరిస్తితులు ఏర్పడుతున్నాయని బాలినేని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపద్యంలో పవను కలిసిన ఆయన ఎంఎల్సీ పదవి ఇవ్వాలని కోరినట్టు ప్రచారం తెర మీదకు వచ్చింది. కానీ, ఇప్పుడున్న పరిస్థితులో ఎమ్మెల్సీ పోస్ట్ కోసం చాలామంది లైన్ లో ఉన్నారు. అయితే జనసేన తరఫున బాలినేనికి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికిప్పుడు ఎమ్మెల్సీ పదవులు కూడా ఖాళీ లేకపోవడం వచ్చే ఎన్నికల వరకు ఆగడం లేదా ఇటీవల రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీల సీట్లు ఖాళీ అయితే వాటిలో ఒకటి బాలినేనికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏదేమైనా బాలినేనికి ఎమ్మెల్సీ ఇచ్చే విషయం జనసేనలో హాట్ టాపిక్ గా మారింది. మరి ఇది జరుగుతుందా లేదా అనేది చూడాలి.



# ముహూర్తం పెట్టిన వంగవీటి ఆశ.. విషయం ఏంటంటే..!



ప్రజా సేవ కోసం వస్తున్నట్టు చెప్పిన వంగవీటి రంగా వారసురాలు వంగవీటి ఆశాకిరణ్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఎలాంటి రాజకీయ పార్టీలో చేరకపోయినా రాధా రంగా మిత్రమండలిని ఏకీకృతం చేసి తద్వారా ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో వంగవీటి ఆశకిరణ్ ముందుకు సాగుతు న్నారు. దీనిలో భాగంగా ఈనెల 26 నుంచి ప్రజల్లోకి వచ్చేందుకు ఆమె ముహూర్తం పెట్టుకున్నట్టు రాధా రంగా మిత్రమండలి వర్గాలు చెప్పుకొచ్చాయి. దీనికి సంబంధించి తాజాగా మిత్రమండలి వర్గాలతోఆమె భేటీ అయ్యారు. ఏ విధంగా ప్రజల్లోకి వెళ్లాలి? ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి? అనే అంశాలపై చర్చించారు. వాస్తవానికి ఆమె కూడా తనపై ఉన్న కాపు ముద్రను పక్కనపెట్టి, ప్రజలకు చేరువ కావాలన్న ఉద్దేశంతో ప్రయత్నం చేస్తున్నారు. దీనిలో భాగంగానే తను అందరికీ సహాయం చేస్తానని అందరి సమస్యలను పట్టించుకుంటా నని, ఎవరు ఏ సమస్యతో వచ్చినా దానిపై దృష్టి పెడతానని కూడా ఇటీవల చెప్పారు. దీనిలో భాగంగానే ఇప్పుడు సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా రాజకీయాలు మాట ఎత్తకుండా ప్రజల్లోకి రావాలన్న ఆలోచనతో ఆశకిరణ్ ఉన్నారు. ఇదే విషయాన్ని రాధా రంగా మిత్రమండలి సభ్యులకు కూడా చెప్పారు. తన తొలి ప్రయాణం ఏలూరు నుంచి లేదా తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రారంభించే దిశగా ఆమె ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈనెల 26న రంగా వర్ధంతి ఉన్న నేపథ్యంలో ఆ రోజు నుంచి ఆమె ప్రజల్లోకి వచ్చేందుకు సన్నద్ధత వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నిధుల సమీకరణ, కార్యకర్తల సమీకరణ, రాధా రంగా మిత్రమండలి ఐక్యం చేయడం వంటి కీలక అంశాలపై ఆశకిరణ్ దృష్టిపెట్టారు. ముందు తనను తాను నిరూపించుకుని ఆ తర్వాత రాజకీయంగా అడుగులు వేయాలన్న ఆలోచనలో ఆశకిరణ్ ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఆమె ఏదో ఒక పార్టీలో చేరడం అయితే ఖాయం. అయితే దీనికి ముందు తనను తాను నిరూపించుకుంటే తన తండ్రి నుంచి వచ్చిన వారసత్వంగా ఉన్న సానుభూతిని సొంతం చేసుకోగలిగితే అది తనకు మేలు చేస్తుందన్న ఆలోచనలో కూడా ఆశ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆవిడ ఈనెల 26 నుంచి పార్టీకి సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఇమేజ్ను పెంచుకునే దిశగా అడుగులు వేయాలనేది వ్యూహంగా పెట్టుకున్నారని తెలుస్తోంది. మరి ఇది ఏ మేరకు సక్సెస్ అవుతుంది.. రాజకీయాలకతీతంగా ఎంతమంది వెంట వస్తారు.. అనేది చూడాలి.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
కోనసీమ జిల్లా ఎడిషన్

సోమవారం, 15 డిసెంబర్ 2025
www.viswamvoice.com






# ఎవరిదీ "పాపం" పంటకుప్పలో దొరికిన పసికందు...

## పురిటి బిడ్డను అమానుషంగా వదిలించుకున్న కన్న తల్లి - సాంఘిక సంక్షేమశాఖ సంరక్షణలో చిన్నారి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో సత్యశ్రీ రోడ్డులో ఆదివారం అమానుష ఘటన చోటుచేసుకుంది. ఏ తల్లి కన్న బిడ్డో క్షణికావేశంలో చేసిన ఆ తల్లి తప్పో లేక ఏమైనా కారణాలు ఉన్నాయో కన్న మగబిడ్డ అడ్డు తొలగించుకోవాలనుకుంది. అభం శుభం తెలియని అప్పుడే పుట్టిన బిడ్డను రోడ్డు ప్రక్కన పడవేశారు. అటుగా వెళుతున్న రైతు రక్తం ఉన్నట్లు గమనించి పరిసరాలను గమనించిన ఆ రైతు కు పంటకుప్పలో ఏడుస్తూ పసి కందు కనిపించింది. అక్కడే చుట్టూ ఏడు కుక్కలు ఉన్నాయి. ఆ కుక్కలు ఆ బాలుడికి ఎటువంటి అపాయం తల పెట్టకుండా అలాగే నిలబడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ రైతు చిన్నారి నీ మండపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్న ఆ బిడ్డను వైద్యులు పరీక్షలు జరిపి సంరక్షించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సమాచారం అందుకుని అక్కడికి చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. బిడ్డను సాంఘిక సంక్షేమ శాఖ సంరక్షణ లో ఉంచుతారు. సామాజిక మాధ్యమాల ప్రభావం తో యువత చెడు దారి నా పడటం తో ఇలాటి ఘోరాలు చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. కాగా రైతు సమయానికి రాకపోతే అనర్థం జరిగేది. ఈ ఘటన పై పూర్తి విచారణ చేపట్టాలని, సీసీ కెమెరాల ఆధారంగా పడేసిన వారి వివరాలు కనిపెట్టి కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# రవికుమార్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి...

## వేగుళ్ళ అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే వేగుళ్ళ : కొవ్వాడ బేబీ అప్పన్నబాబు




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట 8 వ వార్డు కౌన్సిలర్ మండపల్లి రవి కుమార్ తన దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని మండపేట 11వ వార్డు కౌన్సిలర్ కొవ్వాడ బేబీ అప్పన్నబాబు అన్నారు. మండపేట టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బేబీ అప్పన్నబాబు దంపతులు పాల్గొని మాట్లాడారు. ఆ రోజు కౌన్సిల్ సమావేశంలో జరిగింది జరిగినట్టు చెప్పకుండా ఉద్దేశ్య పూర్వకంగా తమ నాయకుడు ఎమ్మెల్యే వేగుళ్ళ పై బురద జల్లడం దుర్మార్గమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులను, స్థానిక సంస్థల నిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యే వేగుళ్ళ పై ఉందన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు ఇస్తానని చెప్పడం తో మున్సిపల్ జనరల్ ఫండ్ ను మరో అభివృద్ధి కార్యక్రమానికి వెచ్చించాలనే ఆలోచనలో ఎమ్మెల్యే వేగుళ్ళ ఉన్నారన్నారు. ఇదే విషయం కౌన్సిలర్ రవి కుమార్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తే ఎమ్మెల్యే వేగుళ్ళ వివరణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. డిసెంబర్ వరకు చూసి అప్పటికి ఎంపీ నిధులు మంజూరు కాకపోతే జనరల్ ఫండ్ ఉపయోగించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేద్దామని ఎమ్మెల్యే వేగుళ్ళ కౌన్సిల్ సభలో స్పష్టం గా చెప్పడం జరిగిందన్నారు. అయితే ఇటీవల తమ నాయకుడు ఓ పక్క జిల్లా విలీనం, మరో పక్క మున్సిపాలిటీకి స్పెషల్ గ్రేడ్, ఇంకో పక్క రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం లో దూసుపోయేలా చేస్తుండటంతో ప్రతిపక్ష నాయకులకు ఏం చేయాలో పాలుపోక ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేశవరం, ద్వారపూడి గ్రామాలలో ఇదే విధంగా దళితవాడల అభివృద్ధికి ఎంపీ నిధులు కోసం ఎదురు చూడటం జరిగిందని, అయితే డిసెంబర్ నెల వచ్చేయడంతో ద్వారపూడి లో 78 లక్షలతోనూ, కేశవరం లో కోటి 45 లక్షలతోనూ ఎస్.సి ఏరియాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. వైసీపీ నేతలు ఎన్ని కుయ్యొక్తులు పన్నినా వేగుళ్ల ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి జరిగి తీరుతుందని ఘంటాపథంగా చెప్పారు. మండపేట పట్టణం లో అయినా, నియోజవర్గం లో అయినా దళిత పేటలకు ఎమ్మెల్యే వేగుళ్ళ ఏమేం చేశారో చెప్పే దమ్ము తమకు ఉందని, ఎమ్మెల్సీ తోట ఏమేం చేశారో చెప్పే దమ్ము మీకుందా అని రవి కుమార్ ను నిలదీశారు. వేగుళ్ళ అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే వేగుళ్ళ అనే విషయం వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. ఆయనతో పోటీ పడి మీ పార్టీ గౌరవాన్ని మీరే చేజాతులా కాలరాసుకోకండని హితవు పలికారు. ప్రతిపక్ష నాయకులుగా ప్రజలకు ఉపయోగపడే సూచనలు, సలహాలు ఇస్తే ప్రజలు హర్షిస్తారని, తమ నాయకుడు వేగుళ్ళ సైతం గొప్ప మనస్సుతో స్వీకరిస్తారనీ అన్నారు. అలా కాకుండా బురదజల్లడమే పనిగా పెట్టుకుని తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు.

### పేద ప్రజలకు ట్రస్ట్ ద్వారా అందిస్తున్న

# సేవలు ఆత్మ సంతృప్తినిస్తాయి

ద్రాక్షారామలో సత్యసాయి ట్రస్ట్ ద్వారా సహాయ కార్యక్రమాలు
నిరుపేద వృద్ధులు, మహిళలు, వికలాంగులకు దుప్పట్లు, చీరలు ఉచిత పంపిణీ
సత్యసాయి సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధినేత శివకోటి మధుసూదనరావు





**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** బాబా ఆశీస్సులతో నిత్యం తాము పేద ప్రజలకు చేస్తున్న సేవలు ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తున్నాయని విశాఖపట్నంకు చెందిన శ్రీ సత్య సాయి సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధినేత శివకోటి మధుసూదనరావు పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం నియోజకవర్గం, ద్రాక్షారామ గ్రామంలో గల చేస్తే వీధిలో స్థానిక నాయకులతో కలిసి మధుసూదనరావు ఆధ్వర్యంలో సుమారు 800 మంది నిరుపేద వృద్ధులు, మహిళలు, వికలాంగులకు సుమారు రూ.4 లక్షలు విలువగల దుప్పట్లు, చీరలు ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్ పి.సుజాత దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి తమ బృంద సభ్యులైన 50 మందితో కూడిన బృందంతో కలిసి, విశాఖపట్నం నుండి ద్రాక్షారామ గ్రామానికి వచ్చి పేద ప్రజలకు బాబా ఆశీస్సులు తో సేవ చేయడం మనసుకు ఆనందం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమం నిమిత్తం తమ బృందం స్వయంగా వండిన భోజనం ప్యాకెట్లు, బాబా వారి ప్రసాదం కలిపి అందజేస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతీ రోజూ విశాఖపట్నం లో గల కింగ్ జేమ్స్ హాస్పటల్ వద్ద 500 మందికి ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. బాబా ఆశీస్సులు తో తాము నిత్యం పేద ప్రజలకు చేస్తున్న సేవలు ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ద్రాక్షారామ మాజీ సర్పంచ్ యాట్ల అప్పారావు, యాట్ల నాగేశ్వరరావు, మాకం కామేశ్వరరావు, విసా ప్రగడ కృష్ణమూర్తి, మాకం పద్మావతి, యాట్ల రోజారాణి , యాట్ల విజయ, యాట్ల లక్ష్మీ, మాకం లక్ష్మీ, ట్రస్ట్ సభ్యులు, స్థానికులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బండారు సత్యానందరావు కృతజ్ఞతలు తెలిపిన శెట్టిబలిజ సంఘీయులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు తెలిపిన శెట్టిబలిజ సంఘీయులు వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బోర్డు డైరెక్టర్గా శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన యల్లమిల్లి చంద్రకుమారి జగన్మోహన్‌కి అవకాశం కల్పించినందుకు నియోజకవర్గ శెట్టిబలిజ నాయకులు మరియు ఆ సామాజిక వర్గీయులు కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావుని మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలియజేశారు.

### కేశవరంలో పీ4 కార్యక్రమంలో

# ఉచిత కంటి పరీక్షలు



**కేశవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పీ 4 కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో, కేశవరం గ్రామంలో ఆదివారం ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 262 మంది ప్రజలు వినియోగించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు కర్రి తాతారావు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, కంటిపూడి శ్రీనివాస్, మండల తెలుగు యువత నాయకులు ఉండమట్ల సురేష్, ఉండమట్ల శ్రీనివాసు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### జంగారెడ్డి గూడెం ఆలయంలో

# చైర్ పర్సన్ రాణి పూజలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** జంగారెడ్డిగూడెంలో వేంచేసియున్న తిరు మల పారిజాత వెంకటే శ్వర స్వామి వారిని, శ్రీ అభయ మధ్గజనేయ స్వామి వార్లను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సందర్శించారు. విశేష పూజలు నిర్వహించారు. వైస్సార్సీపీ నాయకులు తాడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి మరణం

# దళిత జాతికి తీరని లోటు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ పార్లమెంట్ సభ్యులు, దళిత ఉద్యమ నాయకుడు కుసుమ కృష్ణమూర్తి మృతి దళిత జాతికి తీరని లోటని సిపిహెచ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ జె.జార్జి పాఫప్, రైతు సంఘం నాయకులు పతి దత్తుడు సంయుక్తంగా పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆదివారం అమలాపురంలో నిర్వహించిన కుసుమ కృష్ణమూర్తి సంతాప సభలో పాల్గొని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అమలాపురంలో మూడుసార్లు ఎంపీగా గెలిపొందారని అన్నారు. పార్టీలకు అతీతంగా అందరితో కలుపుకొని పనిచేశారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ పార్లమెంట్ సభ్యులుగా కుసుమ కృష్ణమూర్తి దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు.

### ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు వాడపల్లి దేవస్థానం పాలకమండలి

# సభ్యురాలు యల్లమిల్లి చంద్రకుమారి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పాలక మండలి సభ్యునిగా తనకు అవకాశం కల్పించినందుకు గాను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకి యల్లమిల్లి చంద్రకుమారి జగన్మోహన్ కృతజ్ఞతలు తెలియజేశారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బండారును కలుసుకొని ఆయనకు దుశ్శాలువా కప్పి, మొక్కను అందజేశారు. తనపై నమ్మకం ఉంచి ఇంతటి మహత్తరమైన అవకాశాన్ని అందించారని పేర్కొంటూ ధన్యవాదాలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు యల్లమిల్లి చంద్రకుమారి జగన్మోహన్‌కి సూచించారు.

# జాతీయ కవితా పోటీల్లో టాప్ 20 విజేతగా సుబ్బారావు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పాత్రికేయుడు సుబ్బారావు కవిగా రాణించడం అభినందనీయం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యాపకుడు పాత్రికేయుడు నటుడు గాయకుడు డాక్టర్ వి వి వి ఎస్ సుబ్బారావు జాతీయ కవితా పోటీల్లో టాప్ 20 విజేతగా రావడం అభినందనీయమని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అన్నారు 36 ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీ శ్రీ కళావేదిక ఇటీవల ఆన్లైన్ జాతీయ కవితా పోటీలు నిర్వహించారు "దగ్గరవుతున్న దూరాలు" (బంధాలు,బంధుత్వాలు) అనే అంశంపై నిర్వహించిన కవిత పోటీల్లో కొత్తపేటకు చెందిన డాక్టర్ సుబ్బారావు తన ప్రతిభను కనబరిచి టాప్ 20 విజేతగా నిలిచారు ఆ మేరకు శ్రీశ్రీ కళావేదిక అధినేత కళా రత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సంస్థ జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరి భూషణం జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు నూక సంపత్ కుమార్ జాతీయ సోషల్ మీడియా కన్వీనర్ నల్ల భాగ్యలక్ష్మి లు విజేత సుబ్బారావు ను అభినందిస్తూ మెమొంటోను పంపించారు ఇదే సంస్థ గతంలో నిర్వహించిన తెలుగు కీర్తి కిరీటం ఎన్టీఆర్ అనే అంశంపై సుబ్బారావు టాప్ టెన్ విజేతగా నిలిచారు, ఆ(అపూర్వ బాల్యం) అనే అంశంపై కవితను అందించి టాప్ టెన్ విజేతగా నిలిచారు అలాగే మరో కవితా సంస్థ ఇటీవల నిర్వహించిన జాతీయ కవితా పోటీల్లో టాప్ 20 విజేతగా నిలిచారు దానిని పురస్కరించుకుని శాసనసభ్యులు బండారు సత్యానందరావు టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ తదితరులు కవి సుబ్బారావు అభినందించారు.

### దళితపేటలో జరగాల్సిన

# అభివృద్ధిని అడ్డుకుంటున్నారు...

## ఎమ్మెల్యే వేగుళ్ళపై దళిత కౌన్సిలర్ రవి కుమార్ లోకాయుక్తలో ఫిర్యాదు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట దళితపేటలో జరగాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ లోకాయుక్త లో పిర్యాదు చేసినట్లు మండపేట 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్ విలేకరులకు తెలిపారు. దీనిపై లోకాయుక్త తమకు అనుకూలంగా చర్యలు చేపట్టిందని వివరించారు. మండపేట 7వ వార్డులో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి సుమారు 49 లక్షల రూపాయలను కౌన్సిల్ తీర్మానం ద్వారా ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకు సంబంధించిన డిపాజిట్ సైతం కాంట్రాక్టర్ చెల్లించారన్నారు. వర్క్ ఆర్డర్ సైతం వచ్చిందన్నారు. అయితే ఆ తరువాత దీనిపై కమీషనర్ ను ప్రశ్నించగా ఆయన ఎమ్మెల్యే వేగుళ్ల ఈ పనిని నిలిపివేయాలని చెప్పినట్లు తనకు చెప్పారన్నారు. దీంతో దీనిపై కౌన్సిల్ లో సైతం తాను ప్రస్తావించగా ఆ పనిని తానే ఆపివేసినట్లు వేగుళ్ళ గంటాపదంగ చెప్పారన్నారు. దీనిపై తాను కర్నూల్ లో ఉన్న లోకాయుక్తను ఆశ్రయించినట్లు చెప్పారు. తన దరఖాస్తును పరిశీలించిన ఆయన తగు చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖ డైరెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ ఆదేశాలను మండపేట మున్సిపల్ కమీషనర్ కు తాము చూపించి పనులు వెంటనే మొదలు పెట్టించాలని కోరినట్లు రవి కుమార్ తెలిపారు.

# మ్యాజిక్ ఫ్యామిలీ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు ప్రముఖ మనస్తత్వవేత్త శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ సౌజన్యంతో స్థానిక మాతృమూర్తి ఆలయం వద్ద పేదలకు పంపిణీ చేయుటకు నూతన క్యాలెండర్లు మడికి ఇంజనీరింగ్ అసిస్టెంట్ బల్ల శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం తొలి క్యాలెండర్ ను శ్యామ్ తన మాతృమూర్తి విగ్రహం వద్ద పెట్టి తల్లికి ఘన నివాళులర్పించారు. సుమారు 5వేల క్యాలెండర్లు పేదలకు పంపిణీ చేయనున్నట్టు ఈ సందర్భంగా శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు డాక్టర్ మోహిత్ సీత సూర్యచంద్రరావు శ్యామ్ అన్నపూర్ణ శ్రీకాంత్ తేజశ్రీ రిషిత్ జాన్విక లు పాల్గొన్నారు.



## హిందూ ఐక్యతను సమరసతను
# విశ్వానికి చాటి చెప్పాలి

**సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ టి.పి.వి.జగన్నాథ్**

**సమాజభివృద్ధికి అందరూ కృషి చేయాలి : జ్యోతుల శ్రీనివాస్ - కత్తిపూడిలో ఆర్.ఎస్.ఎస్. హిందూ ధర్మ సమ్మేళనం**





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముందుగా మనం మనసా, వాచా, కర్మణా సంపూర్ణంగా మారి ఆపై మన హిందువుల ఐక్యతను, సమరసతను ఈ విశ్వానికి అంతటికీ చాటి చెప్పాలని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ టి.పి.వి.జగన్నాథ్ పిలుపును ఇచ్చారు. భారత దేశానికి ఆత్మ, ప్రాణం హిందూ ధర్మమేననీ, ఈ ధర్మాన్ని పాటిస్తూ నెరవేర్చడంతో ఈ ప్రపంచానికి విశ్వ గురువును చేయాలని ఆయన వివరించారు. హిందూ సంస్కృతి రక్షించి, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైఖ్యపరచి భారత దేశాన్ని విశ్వ గురువుగా నిర్మాణం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్.ఎస్.ఎస్) 1925లో ఆవిర్భవించింది. సంఘ ప్రయాణంలో 100 సంవత్సరాల నిరంతర కృషిని స్మరించుకొని భవిష్యత్ సాధనా మార్గాన్ని దర్శిస్తూ ఈ మహత్కార్యములో హిందువులను మరింత జాగృతం చేసేందుకు దేశం అంతటా హిందూ ధర్మం ప్రచార సమ్మేళనాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు ఖండ, కత్తిపూడి ఉప మండలం (కత్తిపూడి, సీతంపేట, నెల్లిపూడి, కొంతంగి, వజ్రకూటం) గ్రామాల ప్రజలకు శంఖవరం మండలం కత్తిపూడిలోని వినాయక మారుతి వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది హిందూ సమ్మేళనాన్ని ఆదివారం మధ్యాహ్నం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ విజయదుర్గా ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు గౌతు అర్జుబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమ్మేళనంలో టి.పి.వి.జగన్నాథ్ ముఖ్యవక్తగా ప్రసంగించారు. ప్రస్తుతం హిందువులపై జరుగుతున్న దాడులపై సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, అలాగే ఆధ్యాత్మికతే హిందూ సమాజానికి బలం, ఐక్యతకు మూలమని పిలుపును ఇచ్చారు. ప్రతి తల్లీ తమ పిల్లలను మరాఠా సైనిక నాయకుడు ఛత్రపతి శివాజీ లాగా పెంచాలని అన్నారు. ఆది అంతం లేని సనాతన ధర్మం ప్రపంచం అంతటా వ్యాపించి ఉంటుందని సనాతన ధర్మం లేనిదే ప్రపంచానికి మనుగడే లేదని ఆశీర్వాద ప్రసంగీకులు కోట కృష్ణకుమార్ పేర్కొన్నారు. 800 సంవత్సరాల మొగలాయి, 200 సంవత్సరాల బ్రిటీష్ ముష్కరులు పాశవిక దమనకాండ కొనసాగించినా సనాతన ధర్మం నిలదొక్కుకుని నేడు విజయపథం వైపు పురోగమిస్తున్నది అని తెలిపారు. మరి ఇంత గొప్ప మతం పరాయి మత పీడనకు తల ఒగ్గడానికి కారణం మనలో ఉన్న అనైక్యత అసూయ ద్వేషాలు అని తెలిపారు. మరొక వక్తగా జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, స్థానిక సాయిప్రియా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ ప్రసంగిస్తూ... సమాజానికి కుల వ్యవస్థ రాచపుండు లాంటిదని, దాన్ని నయం చేసుకుని సమరసత వైపు సాగాలనే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశంలో ప్రారంభమై ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించి విశ్వ వ్యాప్త మైందని తెలిపారు. సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మనం సంకల్ప బద్దులమై, మనలో ఉన్న బలహీనతలను అధిగమించి సామాజిక సమరసత, పర్యావరణ సంరక్షణ, ఆదర్శ కుటుంబ వ్యవస్థ, స్వదేశీ జీవన విధానం, పౌర విధులు చక్కగా పాటిస్తూ పరమ వైభవ స్థితి అయినటువంటి విశ్వ గురు స్థానానికి ఎదగాలని, సమాజభివృద్ధికి అందరూ కృషి చేయాలని జ్యోతుల శ్రీనివాస్ పిలుపును ఇచ్చారు. కళాకారులు ప్రదర్శించిన కళా సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టు కున్నాయి. సాయిప్రియా సేవా సమితి ఛైర్ పర్సన్ జ్యోతుల గంగాభవాని సభకు ఉపాధ్యక్షత వహించిన ఈ సమ్మేళనంలో ఆర్.ఎస్.ఎస్. పరివార సంస్థలు, పదాధికారులు, స్థానిక పెద్దలు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని వాజపేయి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** బీజేపీ సీనియర్ నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ చేశారు. కాకినాడలోని రామారావు పేట మూడు లైట్లు జంక్షన్ వద్ద రాజా ట్యాంక్ ప్రాంగణంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ శ్రేణులు హాజరయ్యారు. రాజా ట్యాంక్ ప్రాంగణంలో వాజపేయి నిలువెత్తు విగ్రహాన్ని ఈ నెల 21వ తేదీన ఏర్పాటు చేస్తామని 25వ తేదీన ఆయన జయంతిని భారీగా నిర్వహిస్తావని వెల్లడించారు. ఈ సందర్భంగా బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వాజపేయి హయాంలో భారతదేశం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. అందుకని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంగణాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. వేదమంత్రోచ్చారణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు ఎనిమిరెడ్డి మాల కొండయ్య, పైడా కృష్ణమోహన్, పైడా భావన ప్రసాద్, వేటుకూరి సూర్యనారాయణ రాజు, మాజీ కార్పొరేటర్లు గోడి సత్యవతి, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ తుమ్మల పద్మ, నాయకులు గోడి వెంకట్, గూటూరు పద్మ, గట్టి సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ, కుండల సాయికుమార్, చక్కా రమేష్, అరిపిరాల శ్రీనివాస్, శంకర్ సింగ్, కే గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్స్ నూతన సంఘం ఏర్పాటు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ ఆదివారం సమావేశమై నూతన సంఘం ఏర్పాటు చేశారు. బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ విశ్రాంత శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు, ఇన్కమ్ టాక్స్ విశ్రాంత అడిషనల్ కమిషనర్ డి.వి.సుబ్బారావు, సీజీఎస్టీ రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ వివి.ఎల్ఎన్.కమలాకరరావు,కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమాఖ్య జనరల్ సెక్రటరీ ఎస్వీఎస్ఎన్.సాయిరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాకినాడ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా కమలాకరరావు, ఉపాధ్యక్షులు తురగా సూర్యారావు(రిటైర్డ్ పోస్టు మాస్టర్), కార్యదర్శి కెవిఆర్. వరప్రసాద్(ఎన్ఐహెచ్), సహ కార్యదర్శి కె.రాజేష్(పోస్టల్స్), కోశాధికారిగా పి.సాగర్(పోస్టల్స్), ఉపకోశాధికారి కెవి.కృష్ణ(ఇన్కమ్ టాక్స్),కార్యనిర్వాహక కార్యదర్శి శరబండి రాజు(బిఎసెనెల్), కన్వీనర్ మూర్తి(కస్టమ్స్), కొకన్వీనర్ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు ఎ.రమణ, సిహెచ్.రామారావు, రవిశంకర్ పట్నాయక్, ఎన్వి అబ్బాయి, విజయకాంతం, జేసీ. చోప్రా, ఎస్.సూర్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడలో వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేసేవరకు పోరాటం చేస్తామని తెలిపారు.

## మెడికవర్ క్యాలెండర్‌ను
# ఆవిష్కరించిన ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ విశేష గుర్తింపు పొందిన కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్య పై అవగాహన పెంపొందించే విధంగా రూపొందించిన ఈ క్యాలెండర్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ సెంటర్ హెడ్ శుభాకర రావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు
# మార్షల్ ఆర్ట్స్ వ్యక్తిగత రక్షణకు ఎంతో ముఖ్యం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలో బాలికల వక్తిగత రక్షణకు మర్షల్ ఆర్ట్స్‌లో శిక్షణా ఇప్పించాలని శాసన మండలిలో కొరిన వెంటనే రాష్ట్ర వ్యప్తంగా ఉన్న పాఠశాలలో మర్షల్ ఆర్ట్స్ శిక్షణా కార్యక్రమాలు ప్రారంబించి సి.ఎం. చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ వెల్లడించారు. కాకినాడ శ్రీనగర్ నగరపాలక సంస్థ బాలికల పాఠశాలలో జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ సర్టిఫికెట్లు, ఇటివల జరిగిన నేషనల్స్‌లో మెడల్స్ సాధించిన క్రీడాకారుల సర్టిఫికెట్ల బహుకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జిల్లా టైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి అర్జునరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నారాయణరావు దంపతులు ముఖ్యఅతిధిగా హజరైయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిధులను జిల్లా టైక్వాండో అసోసియేషన కార్యదర్శి అర్జునరావు, సభ్యులు పుష్పాగుచ్చాలు అందించి స్రావాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం బ్లాక్ బెల్ట్ టెస్ట్ పాసైన క్రీడాకారులకు సౌత్ కోరియాలోగల టైక్వాండో ఇంటర్నేషనల్ కౌన్సిల్ నుండివచ్చి బ్లాడ్ బెల్ట్ ఫస్ట్ డెన్, సెంకడ్ డెన్ సర్టిఫికెట్లను ముఖ్యఅతిథి ఎమ్మెల్యే కర్రి పద్మశ్రీ క్రీడాకారులకు అందజేసారు. అదేవిదంగా ఇటివల రాయబరేలీలో జరిగిన నేషనల్స్ మెడల్స్ సాధించిన క్రీడారులు హర్షవర్ధన్, వంశీ, వెంకన్నదొర, హరికిరణ్ గంగాభవానీ, హరిద్వార్ నేషనల్స్ మెడలిస్టు అయిన అఖిల్, మల్లిఖ, లకు మెడల్స్ సర్టిఫికెట్లను కర్రి పద్మశ్రీ అంద జేసారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ మహిళలు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవడం ద్వారా అపద సమయంలో వారిని వారు రక్షించుకునే అవకాశం ఉంటుందని ప్రతి బాలికలు తప్పకుండా మర్షల్ ఆర్ట్స్ సాధన చేయాలన్నారు. అనంతరం ఎలాంటి లాభాపేక్ష లేకుండా చిన్నారులకు ఉచితం మర్షల్ ఆర్ట్స్ శిక్షణ ఇస్తున్న అర్జునరావును ఎమ్మెల్సీ దంపతులు సాలువాకప్ప సత్కరించారు. ఈకార్యక్రమంలో ట్రైనర్స్ సత్యనారాయణ, తులసీ, కె.వి. సత్యనారాయణ, పి.త్రిమూర్తులు అరుణా, దుర్గా, జిల్లా నలుమూలల నుండి వచిన కీడారులు పాల్గొన్నారు.

## మలబార్ గోల్డ్ డైమండ్స్ షోరూంలో
# వజ్రాభరణాల ప్రత్యేక ప్రదర్శన



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ వజ్రభరణాల విక్రయ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కాకినాడ శాఖలో నవ వధువులు అమితంగా ఇష్టపడే రత్నాలు, వజ్రభారణాల ప్రదర్శన ఈనెల 10 నుండి జనవరి 18, 2026 వరకు నిర్వహిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన సందర్భంగా, కస్టమర్ల కోసం అన్ని బంగారం, అన్కట్, రత్నాల ఆభరణాల తరుగు చార్జీలపై 30% వరకు, వజ్రాల విలువ పై 30% వరకు తగ్గింపు ఆఫర్లు జనవరి 18, 2026 వరకు చెల్లుబాటు అవుతుందని అన్నారు. ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

## తన కష్టార్జితాన్ని పరులకు పంచుతున్న గొప్ప మానవతావాది
# డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ధనం పుట్టింది భోగాల కోసం కాదని పరులకు సహాయం చేస్తూ ఆనందంగా గడపడానికి అని ఆది శంకరాచార్యుల బోధనల కనుగుణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కష్టార్జితాన్ని పరులకు పంచుతున్న గొప్ప మానవతావాది అని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇటీవల మంగళగిరిలో టి- 20 ప్రపంచ కప్ సాధించిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసిందన్నారు. విజేతలైన ఒక్కొక్కరికి రూ. అయిదు లక్షలు, సహాయ సిబ్బంది ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు చొప్పున మొత్తం రూ. 84 లక్షలు ప్రోత్సాహకంగా పవన్ కళ్యాణ్ అందజేశారని అన్నారు. అదేవిధంగా ప్రతి మహిళ క్రికెటర్ కు పట్టుచీర , శాలవాలతో జ్ఞాపికను, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులు అందజేశారని అన్నారు. అదేవిధంగా ఆ జట్టులో మన ఆంధ్రకు చెందిన క్రికెటర్లకు నిత్యవసర సరుకులు కూడా పవన్ కళ్యాణ్ పంపడం జరిగిందన్నారు .జట్టు కెప్టెన్ దీపిక తన గ్రామం రోడ్ల పరిస్థితి వివరించగా అదే రోజు సాయంత్రానికి పవన్ కళ్యాణ్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడమే గాక నాణ్యతగా రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారని అన్నారు. తనకు వేలాది ఎకరాలు లేవని, వందల కోట్లు ఆస్తులు లేవని సామాన్య జనం కోసం రాజకీయాల్లోకి వచ్చానని ప్రకటించిన విధంగానే సినిమా నటుడిగా తనకు వచ్చే పారితోషకాన్ని దానకర్ణుడిగా అవసరమైన వారికి అందిస్తూ మానవతను చాటుతున్నారని అన్నారు. ఎలాంటి అవినీతి మరకలు లేకుండా ప్రజా సమస్యలపై స్పష్టమైన నిబద్ధతతో కూడిన దృక్పథమే సిద్ధాంతంగా సేవలు అందిస్తూ దేశంలో నిజాయితీపరుడైన రాజకీయ నాయకుడిగా వినతికెక్కిన గొప్ప మానవతావాది పవన్ కళ్యాణ్ అని అడబాల కొనియాడారు.

# లయన్స్ విజన్‌చే వాటర్ ప్లాంట్ బహూకరణ



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రామారావు పేటలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ (ఓరియంటల్) పాఠశాలకు సుమారు 1,50,000 విలువచేసే అత్యధిక వాటర్ ప్లాంట్‌ను లయన్స్ విజన్ క్లబ్ చే బహుకరించగా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో మహిళలు అత్యధికంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. లయన్స్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలను నిర్వహిస్తూ వారి జీవితాలలో ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని కొనియాడారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వృద్ధాశ్రమాలకు సహకారాన్ని అందించడమే కాక ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహణకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అభినందించారు. వాటర్ ప్లాంటును ఆదిలక్ష్మి సోమశేఖర రావు జ్ఞాపకార్థం వారి వంశీకులైన అనన్య , సోమేశ్వరరావు, భానుమతులు దాతలుగా ముందు రావడం పట్ల లయన్స్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు రక్షణ మంచినీటి సరఫరాకు ఎటువంటి అవాంతరం కలగకుండా నిరంతరం జరిగేలాగా లయన్స్ జోన్ చైర్పర్సన్ ఎం ఎస్ ఆర్ వి సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని అభినందిస్తూ వివిధ ప్రాజెక్టుల నిర్వహణకు దాతల నుండి ప్రత్యేక సహాయ సహకారాలను తీసుకురావడంలో ఎమ్మెస్సార్ వి తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ స్ఫూర్తిదాయకమని లయన్స్ గవర్నర్ అన్నారు. కార్యక్రమానికి లయన్స్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు నల్లమిల్లి శ్రీదేవి రెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి బులుసు శ్రీ వాణి, కోశాధికారి వి .జయలక్ష్మి, జోన్ చైర్ పర్సన్ మణిబాబు,మాండలిక ప్రసన్న ఈశ్వర కుమార్ లింగమల్లి కృష్ణమూర్తి ,వినోద్ ,మెట్ట రాధా, పుత్రరావు, జయలక్ష్మి ,సాయి, బాబా మండలిక శాస్త్రి లు పాల్గొన్నారు.నయన కంటి ఆసుపత్రి అధినేత డాక్టర్ రావుల శ్రీరామ్,డెంటల్ క్యాంపు డాక్టర్ స్వరూప్ ల ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. అంతకుముందు లైన్స్ గవర్నర్చే మొక్కలు నాటే కార్యక్రమాన్ని లయన్స్ విజన్ క్లబ్ నిర్వహించింది .ప్రకృతి రాగ సంస్థ అధినేత కెప్టెన్ మల్లికార్జున్ రావు చే పాఠశాల పిల్లలందరికీ పరీక్ష అట్టలు మరియు బిస్కెట్లను లయన్స్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

# రామ్మోహన్ నాయుడు క్రేజ్ పోయిందా ?




కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు యువ నేత. ఏపీ సీఎం చంద్రబాబుకు అలాగే ప్రధాని మోడీకి కూడా బాగా ఇష్టుడిగా పేరు పొందారు. తెలుగు ఇంగ్లీష్ హిందీ భాషలలో మంచి ప్రావీణ్యం ఉన్నవారు. ఇక ఏ విషయం మీద అయినా నిండు పార్లమెంట్ లో అనర్గళంగా మాట్లాడగల నేర్పు ఆయన సొంతం. అందుకే ఆయనకు గట్టిగా నాలుగు పదుల వయసు రాకుండానే కేంద్రంలోని కీలకమైన ఫోర్ట్ పోలియోలలో ఒకదానిని ఇచ్చారు. అలా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా నియమితులు అయ్యారు. ఇదిలా ఉంటే ఉత్తరాంధ్ర నుంచి పెద్ద పదవి, కేబినెట్ ర్యాంక్ స్థానం చిన్న వయసులోనే రామ్మోహన్ కి దక్కడంతో దానిని ఆయన నిభాయించగలరా అన్న సందేహాలు అయితే అనేక మందిలో ఉండేవి. కానీ ఆయన మెల్లగా నెగ్గుతూ వస్తున్నారు.

**అది తొలి సవాల్ :**

ఇదిలా ఉండగా ఈ ఏడాది జూన్ లో గుజరాత్ లోని అహ్మదాబాద్ వద్ద ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి ఏకంగా 250 మంది దాకా మరణించడంతో రామ్మోహన్ కి తొలి సవాల్ ఎదురైంది. ఆ ప్రమాదం చాలా దారుణమని అంతా భావించారు. ఇందులో ఎయిర్ ఇండియా నిర్లక్ష్యం కూడా ఉందని కూడా ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర మంత్రికి ప్రైవేట్ ఆపరేటింగ్ వ్యవస్థ మీద మరింతగా పట్టు పెరగాల్సి ఉందని కూడా ఈ ఘటనని చూసిన వారు అంతా విమర్శించారు. మొత్తానికి దీని మీద విచారణ జరిపిస్తామని కేంద్ర మంత్రిగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. అలా ఆ ఇష్యూ తగ్గిపోగానే ఇపుడు కొత్తగా ఇండిగో సంస్థ అతి పెద్ద సంక్షోభాన్ని క్రియేట్ చేసింది. దాంతో ఈసారి ఏకంగా జాతీయ మీడియాతో పాటు, విపక్షాలు సైతం రామ్మోహన్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు ఎక్కుపెట్టారు.

**ఆయనదే తప్పు అంటూ :** ఒక విధంగా రామ్మోహన్ నాయుడు ఈ ఘటనతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అదే సమయంలో పార్లమెంట్ కూడా రన్ అవుతూండడంతో ఆయన అటు సభకు జవాబు చెప్పుకుంటూ ఇటు మీడియాను ఎదుర్కొంటూ మరో వైపు చూస్తే ఇండిగో సంస్థ విషయంలో చేయాల్సిన చర్యలు చేపడుతూ చాలా ఒత్తిడినే ఎదుర్కొన్నారు. ఇక రామ్మోహన్ నాయుడు ఇమేజ్ పూర్తిగా పోయిందని ఆయన పదవికే ముప్పు రావచ్చు అని మీడియాలో వార్తలు ప్రచారం కూడా అవుతూ వస్తున్నాయి. ఇవన్నీ ఒక వైపు పుకార్లు షికారు చేస్తూండగానే రామ్మోహన్ నాయుడు తానేంటో నిరూపించుకునే ప్రయత్నం చేశారు. ఆయన పార్లమెంట్ లో ధీటైన సమాధానంతో విపక్షాల ఆరోపణలు విమర్శలకు చెక్ పెట్టారు. పౌర విమానయాన శాఖ మోనోపలీ అయిపోయింది అన్న విమర్శలకు అర్ధవంతమైన బదులు ఇచ్చారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలను కూడా దృష్టిలో ఉంచుకుని దేశీయ విమానయాన రంగంలో మార్పులు తీసుకుని వస్తున్నామని అందులో భాగమే ఇదంతా అని వివరించే ప్రయత్నం చేశారు. మోనోపలీ అన్న మాటే రాదని అదే సమయంలో ప్రయాణికులు తమ లక్ష్యంగా ఉంటారని వారి కోసమే సంస్కరణలు అయినా మరేవి అయినా తెస్తామని కూడా ఆయన నొక్కి చెప్పారు.

**టీవీ డిబేట్స్ లోనూ :** అదే విధంగా రామ్మోహన్ జాతీయ స్థాయిలో టీవీ డిబేట్లలోనూ తన బలమైన వాయిస్ వినిపించారు. ఆయన కేంద్ర ప్రభుత్వం పౌర విమాన యాన రంగంలో తీసుకుంటున్న చర్యల గురించి కూడా గట్టిగానే చెప్పుకొచ్చారు. మొత్తానికి చూస్తే ఇంత సమర్థంగా తన వాదనలు వినిపించడం ద్వారా అటు ఎండీయే ప్రభుత్వానికి ఇటు విపక్షాలకు మరో వైపు మీడియాకు కూడా తానేంటో రామ్మోహన్ తెలియచేశారు అని అంటున్నారు. ఏణ్ణర్థం కేంద్ర మంత్రిగా ఉన్నా కూడా రామ్మోహన్ కి రాని పేరు ఈ ఘటనతో వచ్చిందని మంచికో చెడ్డకో దేశవ్యాప్తంగా రామ్మోహన్ పేరు మారుమోగింది ఇదే సందర్భంలో అని అంతా అంటున్నారు.

### సేవా కార్యక్రమాలు జోడించి

# కుడిపూడి సత్తిబాబు జన్మదిన వేడుకలు

**నా జీవితం టిడిపికే అంకితమని వెల్లడి - పలు వృద్ధ ఆశ్రమాల్లో వృద్ధులకు, వికలాంగులకు పండ్లు, దుప్పట్లు, భోజనాలు పంపిణీ**
**పాల్గొన్న టిడిపి శ్రేణులు, అభిమానులు, బిసి నేతలు**
















**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టేకుమూడి గణేష్, శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీను ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. నామవరం వి.ఎస్ మహాల్ వద్ద ఉన్న మానవీయ ఐక్య అసోసియేషన్ ఆశ్రమంలో మాసా ఫౌండేషన్లో 50 మంది వృద్ధులకు, వికలాంగుల అల్పాహారం, రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి శ్రీను, శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీను, గెద్దాడ వెంకట కృష్ణ,వడిశల నారాయణ రావు,గుత్తుల వెంకటేశ్వరరావు, వాసు శెట్టి శ్రీను, నోట్ల కుమార్, జిత్తుగ శ్రీను,పితాని మహాలక్ష్మి, పిల్లి భాస్కర రావు, సూరంపూడి శ్రీహరి రావు,కడలి శ్రీనివాస్, పంపన శివ రామ్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీవివేకానంద మహా రోగి ఆరోగ్య కేంద్రంలో..**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టేకుమూడి గణేష్, శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీను ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. బొమ్మూరు లో ఉన్న వివేకానంద మహారోగి కుష్టి రోగుల కేంద్రం లో దుప్పటి,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి శ్రీను, శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీను, గెద్దాడ వెంకట కృష్ణ,వడిశల నారాయణ రావు,గుత్తుల వెంకటేశ్వరరావు, వాసు శెట్టి శ్రీను, నోట్ల కుమార్, జిత్తుగ శ్రీను, పితాని మహాలక్ష్మి, పిల్లి భాస్కర రావు, సూరంపూడి శ్రీహరి రావు,కడలి శ్రీనివాస్, పంపన శివ రామ్ తదితరులు పాల్గొన్నారు.

**చెవిటి మూగ వికలాంగుల పాఠశాలలో...**

ధవళేశ్వరం రోడ్డులో ఉన్న పలుకు చెవిటి మూగ విద్యార్థుల పాఠశాల లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ లు, డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, వెంకి, షబ్బీర్, గుత్తుల ఫణీ,గన్నవరపు సంజయ్ పుచ్చల శివ తదితరులు పాల్గొన్నారు.

**క్రికెట్ క్రీడాకారుల సమక్షంలో...**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా వేమగిరి సెంటర్లో ఉన్న టీడీపీ మహానాడు గ్రౌండ్లో ఎర్ర కొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు క్రీడలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. క్రీడాకారులకు 16,వేల మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మనసాల రవి,గొర్రెల రాజు,దుబాసి నవీన్, పూడి సాయి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

**నా జీవితం టీడీపీతోనే..**

నాకు శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్గా అవకాశం కల్పించి నా జీవితం ఉన్నత స్థాయికి చేర్చిన నారా చంద్రబాబునాయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ లకు రుణపడి ఉంటానన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. ఆదివారం రాజమండ్రి రూరల్ డి మార్ట్ వద్దగల జూరా హోటల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఉభయ రాష్ట్రాల నుంచి వచ్చిన శెట్టిబలిజ సంఘీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు జోడు గుర్రాల మాదిరిగా పరుగులు పట్టిస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగాలంటే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు పాలన కొనసాగా లని సూచించారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ, గౌడ, యాత, ఈడిగా, శ్రీశైయన తదితర కులాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యనారా యణ, రామకృష్ణారెడ్డి, పితాని శ్రీను, పెచ్చేటి దేవేందర్, వివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీలో...**

బొమ్మూరులో ఉన్న గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ లో వృద్ధులకు దుప్పట్లు ,పండ్లు పంపిణీ చేశారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారి మిత్ర బృందం పేదలకు పళ్ళు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి ఫాలోవర్స్, కుడిపూడి మిత్రబృందం, గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ నిర్వాహకురాలు కావూరి వరలక్ష్మి, కావూరి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆన్ లైన్ ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో...**

ది రాజమహేంద్రవరం ఆన్ లైన్ ఆటో వర్క్స్ అండ్ ఓనర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్,ఆన్ లైన్ ఆటో డ్రైవర్ల యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కుడుపూడి సత్తిబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజమండ్రి జూరా హోటల్ ప్రక్కన గల స్థలంలో కుడిపూడి సత్తిబాబు జన్మదినం సందర్భంగా 500 మంది ఆటో డ్రైవర్లకు యూనీఫారం కాకీ షర్టులు పంపిణీ చేశారు. శెట్టి బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ కుడిపూడి సత్తిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు అండగా ఉంటుందని అన్నారు. ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్న తరుణంలో ఆటో డ్రైవర్లకు రూ 15 వేలు మంజూరు చేశారని అన్నారు. ఆటో డ్రైవర్లు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందు ఉంటానని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆన్ లైన్ ఆటో డ్రైవర్లు ప్రత్యేక యాప్ ఏర్పాటు చేసి రాష్ట్ర నికి ఆదర్శం గా నిలుద్దామని అన్నారు.ఆటో డ్రైవర్లు సమస్యలు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ది రాజమహేంద్రవరం ఆన్ లైన్ ఆటో వర్క్స్ అండ్ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండ రామచంద్రరావు, సెక్రటరీ సంతోష్, ట్రెజరర్ చంటి,ఎడ్వజర్ శ్రీను, బత్తిన మణి కంఠ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పార్లమెంట్ పరిధిలో

# సంసద్ క్రీడా మహోత్సవ్-2025

**డిసెంబర్ 16 నుంచి 21 వరకు పోటీలు నిర్వహణ**
**21న మారథాన్ నిర్వహణ - 22న ముగింపు వేడుకలు : ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి పార్లమెంట్ పరిధిలో సంసద్ క్రీడా మహోత్సవ్ 2025ను జిల్లాలోని 18మండలాల, జిల్లా కేంద్రంలో డిసెంబర్ 16 నుండి 21 వరకు ఘనంగా క్రీడా వేడుకలు, డిసెంబర్ 22న ముగింపు వేడుకలు నిర్వహించనున్నట్లు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. యువతలో క్రీడలపై ఆసక్తి పెంపు, ఆరోగ్యం, ఫిట్నెస్ ప్రోత్సాహం, గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించడం ఈ మహోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. మొత్తం 18 మండలాల్లో విభిన్న క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్న ట్లు తెలిపారు. డిసెంబర్ 21న జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో మహిళల, పురుషుల మారథాన్ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురుషులకు 5 కి.మీ. మారథాన్, మహిళలకు 3 కి.మీ. మారథాన్ ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమవుతాయనీ తెలియ చేశారు. డిసెంబర్ 22 న ఆర్ట్స్ కళాశాల లో అవార్డు ప్రదానోత్సవం ఏర్పాటు చేయబడిందనీ తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రిజిస్ట్రేషన్ వెబ్సైట్: **https://sansadkhelmahotsav.in** ఈ మహోత్సవంలో భాగంగా అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, ఫుట్బాల్, కబడ్డీ, ఖో–ఖో, టెన్నికాయిట్ (మహిళలు), త్రోబాల్, వాలీబాల్, యోగా వంటి 10 క్రీడా విభాగాలు నిర్వహించడం జరుగుతుందనీ తెలిపారు. కనీసం ఐదు క్రీడల్లో ప్రతి మండలంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందనీ, వాటిలో యోగా విభాగం తప్పనిసరి ఎంపిక చెయ్యాలని కోరడం జరిగిందన్నారు. డిసెంబర్ 16, 17, 18 తేదీల్లో మండల స్థాయిలో, 19, 20, 21 తేదీల్లో జిల్లా స్థాయిలో క్రీడా విభాగాల పోటీలు జరుగుతాయన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి లాలా చెరువు వరకు 21వ తేదీన మారథాన్, 22న ముగింపు వేడుకలు అదే ప్రాంగణంలో జరగనుందనీ, ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. క్రీడలు నిర్వహణ నేపథ్యంలో ఎంఎల్సీ సోము వీర్రాజు, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు సంసద్ క్రీడా మహోత్సవ్ పోస్టర్ను విడుదల చేసినట్లు క్రీడా పోటీల నిర్వాహకులు శ్రీమతి హసీనా షేక్ తెలిపారు. జిల్లాలో పాఠశాల విద్య, జిల్లా పంచాయతీ రాజ్, క్రీడా సంస్థల సంయుక్త సమన్వయంతో పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేయబడు తున్నాయని జిల్లా క్రీడాసాధికారిక అధికారి డి.ఎమ్.ఎమ్.శేషగిరి వెల్లడించారు.

# మీకోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథాతథం

**ప్రజల నుంచి అర్జీల స్వీకరణ : కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 15 సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వరకు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం" కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిం చనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు తమ వినతులను **Meekosam.ap.gov.in** వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని, అలాగే నమోదు చేసిన అర్జీల స్థితిని తెలుసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు మరియు అవసరాలు ఉన్న వారికి అనుకూల వసతులు కల్పించాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 95523 00009 ద్వారా కూడా పలు పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎమ్మార్వో ఆఫీస్లో ఆదిత్య వాలంటీర్లచే స్వచ్ఛభారత్..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కోటిపల్లి బస్టాండ్ దగ్గర ఎమ్మార్వో ఆఫీస్ లో ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా డిగ్రీ & పి. జి కళాశాల, యానిమేషన్ వింగ్ మరియు బిజినెస్ స్కూల్ ఎన్.ఎస్.ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు నేడు స్వచ్ఛభారత్ లో పాల్గొన్నారు. పెద్దపెద్ద ఎండిన చెట్లను తొలగించి, పనికిరాని చెట్లను కొట్టివేసి, ఖాళీ స్థలంలో నేరేడు, మామిడి, పనస,ఉసిరి, మొక్కలను నాటడానికి సిద్ధం చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు నిరాటంకంగా జరిగింది. రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ మరియు యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావు, డాక్టర్ బి హెచ్ వి రమాదేవి, ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ పోలుకొండ సాయి,అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ బి,విమల,ఆఫీస్ స్టాఫ్,బి కిరణ్ కుమార్, ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ కోశాధికారిణి డా.వి. ఎన్.వి.ఎ.బి.ఎస్. మహాలక్ష్మి,ఎఫ్.ఎస్.ఎస్. కు చెందిన సుధాకర్ పట్నాయక్,ఆజాద్ రాజు,డి పోసిరామ్,ఎస్. పృధ్విరాజ్,పి మనోజ్ తేజ,ఎ ఆదిత్య,ఎస్కే ఆదిల్,బి ముఖేష్,సిహెచ్ కార్తీక్,వి జగదీష్,బి గౌతమ్, ఎన్ సుమ,జి కౌసల్య,వి శ్రావణి,బి. సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

# అపస్మారక స్థితిలో ఫస్ట్ ఎయిడ్ చేసి రోగి ప్రాణాలు కాపాడవచ్చు

**రాజమండ్రి రెడ్ క్రాస్ భవనంలో ఫస్ట్ ఎయిడ్ శిక్షణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్లెల్లో ప్రాథమికంగా వైద్య సేవలందించే పీఎంపీలకు ప్రథమచికిత్స శిక్షణ ఎంతో అవసరమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ కామిరెడ్డి వెంకట రమణ అన్నారు. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యం లో ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణ పాల్గొని మాట్లాడుతూ ఎవరికైనా ఏదైనా అపాయం జరిగినప్పుడు నిపుణుల వైద్యం అందేవరకూ తాత్కాలికంగా చేయు ఉపయుక్తకరమైన వైద్య విధానమే ఫస్ట్ ఎయిడ్ అని ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ పొంది చిన్న చిన్న గాయాలకు, సాధారణ శరీర రుగ్మతలకు,రోడ్డు ప్రమాదంలో గాయపడిన సమయంలో, వ్యక్తి మంటల్లో చిక్కుకున్న సమయంలో,వ్యక్తి పాము కాటుకు గురియైన సమయంలో, ఎవరైని అపస్మారక స్థితి లో ఉన్నపుడు ఫస్ట్ ఎయిడ్ అందించి రోగి ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఈ శిబిరంలో ప్రథమ చికిత్సలో పలు అంశాలపై శిక్షణ అందించారు. ముందుగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు చిత్ర పటానికి రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ వైస్ చైర్మన్ రమణ, జిల్లా కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మి,రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఎమ్ పద్మావతి, డాక్టర్ జెల్లా సురేష్, బోను రామకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు, పీఎంపీ జిల్లా అధ్యక్షులు పూలమాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ రాంబాబు,ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ వియ్యపు గోపాలకృష్ణ ,పీఎంపీ జిల్లా కార్యదర్శి పీ దేవానందం, పీఎంపీ రాష్ట్ర నాయకులు కోన సత్యనారాయణ, ఆలమూరు మండల అధ్యక్షులు ఏడిద లక్ష్మణాచార్యులులతో పాటు సభ్యులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్స్ అందజేశారు.

# అమరావతి ప్రాంత రైతుల జీవితాలు నేటికీ ప్రశ్నార్ధకమే..

**భారతదేశంలోనే అమరావతి అతి పెద్ద పాలకుల భూదోపిడి : మేడా శ్రీనివాస్ ఆవేదన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రబాబు కూటమి సర్కార్ లో మొట్ట మొదట జైలుకు వెళ్ళే నేతలు ఎవరు ! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సందేహం వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ అమరావతి రాజధాని పేరుతో ఇప్పటికే సుమారు 33 వేల యకరాల పైభడిన భూమిని రైతుల నుండి సిఆర్డిఏ ముసుగులో బలవంతంగా సమీకరించారు. పచ్చటి వ్యవసాయంతో సాగు చేసుకుంటు ప్రకృతి సాక్షిగా మంచి అరోగ్యాలతో జీవనం సాగించిన ఆ ప్రాంత రైతుల జీవితాలు నేడు ప్రశ్నర్ధకంగా మారాయి. ప్రభుత్వాన్ని నమ్మి భూములు ఇచ్చిన రైతులకు నేడు ప్రభుత్వం నుండి ఖచ్చితమైన భరోసా లేదు. ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ బాండ్లకు విలువ లేకుండా పోయింది. బ్యాంకులు ఋణాలు సైతం ఇవ్వటం లేదు. వ్యవసాయాన్ని నమ్ముకున్నాళ్ళు రైతు కుటుంబాలు నమ్మకమైన జీవితాలను అనుభవించేవారు. నేడు, రేపు పరిస్థితి ఏమిటి ! బిడ్డల భవిష్యత్ ఏమిటి అంటు రైతులు మానసిక వేదనకు నిత్యం గురవుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు పై భడి కావొస్తుంది . రైతుల నుండి భూములు తీసుకుని సుమారు 10 ఏళ్లు కావొస్తుంది . భూములు అయితే ప్రభుత్వం తీసేసుకుంది. ఆ భూమిపై రైతుల హోక్కులను మాత్రం ఆవిరిని చేసేసారు . రైతుల బిడ్డలు చదువులకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్నారు. రాజధాని నిర్మించేది ఎప్పుడు. ఆ స్వప్నన్ని మనలో ఏ ఒక్క రైతు అన్నా చూస్తారా! కనీసం బిడ్డలైనా రాజధానికి ఇచ్చిన భూముల ప్రతిఫలం అనుభవిస్తారా! అనే ఆదోళనలో అమరావతి చుట్టు ప్రక్కల రైతులు నిరాశ, నిస్పృహలతో కొట్టు మిట్టాడుతున్నారని ఆయన తీవ్ర మనస్థాపం చెందారు. అమరావతి కేంద్రంగా రాజధాని పేరుతో జరుగుతున్న మొత్తం భూ దోపిడికి సంబందించి జరుగుతున్న మోసం యావత్ భారతదేశం లోనే అతి పెద్ద కుంబకోణంగా చరిత్రలో నిలిచిపోతుంది. సజావుగా పాలన సాగించ గలిగే ప్రభుత్వాలను ప్రజలు ప్రోత్సహిస్తే భవిష్యత్లో అమరావతి కేంద్రంగా జరిపిన భూ సమీకరణకు బాధ్యులైన ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలకమైన అధికారులు, ప్రజా ప్రతినిధులు జైలుకు వెళ్ళాల్సిన పరిస్థితులు తప్పవన్నారు. ఒక పోలవరం జాతీయ ప్రాజెక్ట్, తెలంగాణాలో కాళేశ్వరం ప్రాజెక్ట్, జాతీయ స్థాయిలో హెరాల్డ్, కోల్, టెలికంమ్ ఇతర కుంబకోణాలు అమరావతి భూ కుంబకోణం ముందు చాలా చిన్నవన్నారు. ఈ మధ్య కాలంలో చైనా మంత్రికి అవినీతి కేసులో ఉరి శిక్ష ఖరారు సంఘటన ప్రపంచంలో అనేక దేశాల పౌరులను ఆలోచింప చేస్తున్నాయి . నిజానికి ఆ దేశాల కన్నా భారతదేశంలో విలువలు, దైవ బలం గల ప్రకృతి శక్తి మెండుగా వున్నాయణి ప్రపంచ దేశాలు బావిస్తాయి. అలాంటిది అవినీతి, పేదరికం, పాలనా కాలుష్యం భారతదేశానికి శాపంగా వెంటాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్లో భూ దోపిడి, ఆర్థిక దోపిడి, మద్యం, ఇసుక, గంజాయి వంటి ప్రమాదకర మత్తు ప్రదార్ధాలు, పాలనా అధికార దుర్వినియోగంతో బలపడుతున్నాయి. ఆంధ్రులును నిత్యం అర్ధనాదాలు వెంటాడుతున్నాయని ఆయన సూటిగా ఆరోపణ చేసారు.

సినీ వాయిస్ CINEMA

మసక మసక చీకటిలో.. 90% రొమాంటిక్ సాంగ్..

# కొత్త వెర్షన్ విన్నారా..?



సింగర్ స్మిత... ఒకప్పుడు వరుస పాటలతో శ్రోతలను అలరించారు. అటు సింగర్ గా.. ఇటు నటిగానూ ప్రేక్షకులకు దగ్గరయ్యారు. కానీ చాలా కాలంగా స్మిత నుంచి మరో సాంగ్ రాలదు. తాజాగా ఇప్పుడు ఆమె 90'%ం% రొమాంటిక్ సాంగ్ 'మసక మసక చీకటిలో'పాటను ర్యాప్ మిక్స్ చేసి విడుదల చేశారు. ఇప్పుడు ఈ పాట యూట్యూబ్ లో దూసుకుపోతుంది. "మసక మసక చీకటిలో.. మల్లెతోట వెనకాల.. మసక మసక చీకటిలో .. మల్లెతోట వెనకాల.. మాపటేళకలుసుకో%ొ% నీ మనసైనది దొరుకుతుంది.. నీ మనసైనది దొరుకుతుంది.. " అప్పట్లో ఈ సాంగ్ ఎంత ఫేమస్ అయ్యిందో చెప్పక్కర్లేదు. 1973లో విడుదలైన దేవుడు చేసిన మనషులు సినిమాలోని ఈ పాట అప్పట్లో సంచలనం. ఇప్పుడు ఇదే పాటకు ర్యాప్ మిక్స్ చేసి న్యూట్రెండ్ కు తగినట్లుగా రిలీజ్ చేశారు సింగర్ స్మిత. క్వీన్ అఫ్ పాప్ సింగర్ స్మిత ఓజిఐమసక మసక సాంగ్ గ్రాండ్ గా లాంచ్ అయ్యింది. స్మిత, నోయల్ నటించిన ఈ సాంగ్ ని విజయ్ బిన్నీ అద్భుతంగా డైరెక్ట్ చేశారు. జార్జ్. సి. విలియమ్స్ అదిరిపోయే విజువల్స్ అందించారు. నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్ గా చేసిన ఈ పాటకి అడెలె ఎడిటర్. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో దర్శకుడు దేవాకట్టా పాల్గొన్నారు. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో పాప్ సింగర్ స్మిత మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. నాన్న ఒక థాట్ ని మొదలుపెట్టారు. అమ్మ నన్ను ఎంతగానో ప్రోత్సహించి తన ఫస్ట్ ఇన్వెస్ట్మెంట్ ని నా మీద పెట్టింది. హాయ్ రబ్బా ఆల్బమ్ అమ్మ ఇన్వెస్ట్మెంట్ తోనే వచ్చింది. దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. ఆ తర్వాత అంతా హిస్టరీ. అదే ఇంటి పేరుగా మారింది. ఇప్పుడు ఇంటిపేరు మార్చుకుని 'ఓజి' చేద్దామని అనుకున్నాం. 2026 లో నా లైఫ్ లో కేవలం మ్యూజిక్ మాత్రమే ఉండబోతుంది. మీ అందరూ కూడా అందులో భాగం కావాలని కోరుకుంటున్నాను. ఈ సాంగ్ ని నాగార్జున గారు బిగ్ బాస్ స్టేజ్ మీద లాంచ్ చేశారు. ఆయన కూడా నా జర్నీలో అన్ని రకాలుగా భాగమై ఉన్నారు. ఆయన ప్రోత్సాహం ఎంతో బలాన్ని ఇస్తుంది. నార్త్ ఇండిపెండెంట్ మ్యూజిక్ చాలా పాపులర్ అవుతుంది. సౌత్ లో మాత్రం నేను ఆపినచోటే ఆగిపోయింది. మళ్ళీ అలా ఆగకూడదని ఒక చిన్న బెంగ వచ్చింది. మళ్ళీ మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నా. సంక్రాంతికి ఒక పాట వస్తుంది. మేమే పండగ తీస్తున్నాం. ఆ పాట ఒక ఫెస్టివల్ లాగా ఉంటుంది. ఇకపై వరుసగా పాటలు రాబోతున్నాయి. మార్చి చివరి నుంచి లైవ్ షోస్ కూడా ఉంటాయి. హైదరాబాద్, ఆంధ్రాలో రెండు లొకేషన్స్, యూఎస్, దుబాయ్, ఆస్ట్రేలియా, సింగపూర్ లో కూడా ఈవెంట్స్ ఉంటాయి" అని అన్నారు. నోయల్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. స్మిత గారి కం బ్యాక్ అందరికంటే ఎక్కువగా హ్యాపీనెస్ నాకే వచ్చింది. ఎందుకంటే వారితో కలిసి స్క్రీన్ ని షేర్ చేసుకున్నాను. స్మిత గారు అంటే అందరికీ ఇష్టం. నేను ఇండిపెండెంట్ మ్యూజిక్ చేయడానికి ఇన్స్పిరేషన్ స్మిత గారు. ఇండిపెండెంట్ మ్యూజిక్ కి చాలా డెడికేషన్ కావాలి. ఈ పాటలన్నీ కూడా మేము చాలా డెడికేషన్ తో చేశాను. తప్పకుండా మీ అందర్నీ గొప్పగా అలరిస్తాయి.




మన శంకరవర ప్రసాద్ గారు ఈ సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకులు, అభిమానులు చిరంజీవి గారి నుంచి కొరుకునే ఫన్, డ్యాన్స్, యాక్షన్ అన్ని ఎలిమెంట్స్ అద్భుతంగా కుదిరాయని అన్నారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' షూటింగ్ పూర్తైంది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేసింది చిత్రయూనిట్. మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న మాస్ అండ్-ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఆకట్టుకునే ప్రమోషనల్ కంటెంట్, దూకుడుగా సాగుతున్న ప్రచార కార్యక్రమాలతో సంచలనం సృష్టిస్తోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ రోజు చిత్ర నిర్మాతలు సినిమా విడుదల తేదీని ప్రకటించడానికి ఒక గ్రాండ్ ఈవెంట్ ని నిర్వహించారు. 'మన శంకర వర ప్రసాద్ గారు' పూర్తి షూటింగ్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్రం సంక్రాంతికి కేవలం 2 రోజుల ముందు, జనవరి 12న థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం విడుదల కావడం వల్ల, ఈ చిత్రం ఏడు రోజుల లాంగ్ వీకెండ్ బెనిఫిట్ పొందుతుంది. పండుగ సెలవుల పూర్తిగా కలిసిరానున్నాయి. మంచి ప్లానింగ్ తో చేసిన రిలీజ్ టైం సంక్రాంతి సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద సినిమాకు బలమైన వసూళ్లను అందించి, ప్రేక్షకుల రష్ ని గరిష్ఠంగా పెంచుతుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి యంగ్ అండ్ డైమనిక్ గా కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. రెడ్ కార్ పై బ్లాక్ సూట్ లో కాఫీ సిప్ చేస్తూ మెగా స్వాగ్ తో మెస్మరైజ్ చేశారు చిరంజీవి. అనిల్ రావిపూడి, చిరు కలయికే ఇప్పటికే చాలా ఎక్సయిట్మెంట్ ని క్రియేట్ చేసింది, రెండు చార్ట్‌బస్టర్ పాటలు సంచలనం సృష్టించాయి. వెంకటేష్ ప్రత్యేక పాత్ర తోడవడంతో సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరాయి. నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో బలమైన తారాగణం ఉండటంతో అంచనాలు గణనీయంగా పెరిగాయి. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని, తమ్మిరాజు ఎడిటింగ్‌ను, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. కథను ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సంయుక్తంగా రాశారు. మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ప్రమోషనల్ యాక్టివిటీస్ ని మరింత జోరుగా చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రాండ్ ప్రెస్ మీట్ లో డైరెక్టర్ అని అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "మెగాస్టార్ చిరంజీవి గారితో ఓపెనింగ్ ముహూర్తంతో స్టార్ట్ చేశాం. అక్కడ్నుంచి ఈ ఏడు ఎనిమిది నెలలో జర్నీ నాకు చాలా మెమొరబుల్. నిన్న ఆయనతో లాస్ట్ వర్కింగ్ డే. నేను ఇంకా ఆ ఎమోషన్ లోనే ఉన్నాను. మేమిద్దరం కూడా ఒక మంచి మెమోరియల్ జర్నీగా షేర్ చేసుకున్నాం. ఒకరినొకరు మిస్ అవుతున్నామనే ఫీలింగ్ ఇద్దరిలో ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన చిరంజీవి గారికి థాంక్యూ సో మచ్. సంక్రాంతి అనగానే నాకు ఒక కనెక్షన్. ఎఫ్2, సరిలేరు నీకెవ్వరు, సంక్రాంతికి వస్తున్నాం.. ఇప్పుడు ఇది నా నాలుగో సంక్రాంతి. నాకెప్పుడూ సంక్రాంతి అంటే ఒత్తిడి ఉండదు . హాలిడేస్ లో సరదాగా ఇంటికి వెళ్లి పండగ పూట థియేటర్స్ కి వెళ్లి ఒక మంచి ఎంటర్టైనర్ ని చూసే ఒక ఎనర్జీ లాగా ఫీల్ అవుతాను. అందుకే సంక్రాంతి ఎప్పుడు కూడా నా కెరియర్లో చాలా ప్రత్యేకం. లాస్ట్ సంక్రాంతికి మీరు ఎంత ఎనర్జీ ఎంజాయ్ చేశారో, అలాంటి ఎంజాయ్మెంట్ ఈ సంక్రాంతి కూడా మీకు దొరకపోతుంది. చిరంజీవి గారి ఫన్ టైమింగ్ ఏంటో ఒక జనరేషన్ విట్నెస్ చేసింది. ఈ జనరేషన్ కి ఒక అప్డేటెడ్ వెర్షన్ తో చిరంజీవి గారు మన ముందుకు రాబోతున్నారు. చాలా ఫన్, డాన్సులు యాక్షన్ అన్నీ చాలా బాగా కుదిరాయి. ఈ సంక్రాంతికి సూపర్ ఎంటర్టైనర్ ఇది. వెంకటేష్ గారు నాకు చాలా ప్రత్యేకమైన హీరో. ఆయన నా గురువు, మెంటర్. చిరంజీవి గారు వెంకటేష్ గారిని దశాబ్దాలుగా వారిని మనం చూస్తూ వస్తున్నాం. అలాంటి ఇద్దరినీ ఒక ఫ్రేమ్ లో చూడాలనేది సినీ లవర్స్ కి ఒక డ్రీమ్ ఉంటుంది. అలాంటి అవకాశం నాకు దొరికింది. చిరంజీవి గారు వెంకటేష్ గారు ఎలా ఎంటర్టైన్ చేయబోతున్నారనేది మీకు చూపించడానికి చాలా ఎక్సయిటెడ్ గా ఉన్నాను. ఈ సినిమాలో చేసిన వెంకటేష్ గారికి థాంక్యూ. చిరంజీవి గారిని ఆడియన్స్, ఫ్యాన్స్ ఎలా కోరుకుంటారో అలా చూపించడానికి 100% ఎఫర్ట్ పెట్టాను. ఆడియన్స్ కి ఆయన విపరీతంగా నచ్చుతారు" అని అన్నారు.

క్రీడా వాయిస్

# సెంచరీలు కొట్టినా లాభం లేదు..

## అప్పటి వరకు వైభవ్ సూర్యవంశీకి ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడే ఛాన్స్ లేదు



యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి 2025 సంవత్సరం చాలా అద్భుతంగా గడిచింది. ఐపీఎల్‌లో అద్భుతమైన సెంచరీ కొట్టిన తర్వాత, అండర్-19 స్థాయిలోనూ తన సత్తా చాటుతున్నాడు. అండర్-19 ఆసియా కప్ మొదటి మ్యాచ్‌లోనే ఏకంగా 171 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు.యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి 2025 సంవత్సరం చాలా అద్భుతంగా గడిచింది. ఐపీఎల్‌లో అద్భుతమైన సెంచరీ కొట్టిన తర్వాత, అండర్-19 స్థాయిలోనూ తన సత్తా చాటుతున్నాడు. అండర్-19 ఆసియా కప్ మొదటి మ్యాచ్‌లోనే ఏకంగా 171 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ విధంగా వరుసగా రికార్డులు బద్దలు కొడుతున్నప్పటికీ, వైభవ్ ప్రస్తుతం భారత జాతీయ జట్టులో మాత్రం ఆడలేదు. ఎందుకంటే ఐసీసీ పెట్టిన ఒక నిబంధన కారణంగా వైభవ్ జట్టులో చేరడానికి వీలు లేకుండా పోయింది. ఆ నిబంధన ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

### ఐసీసీ నిబంధన ఏమిటి?

అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి క్రీడాకారులకు కనీస వయస్సు 15 సంవత్సరాలు ఉండాలి. ఇది ఐసీసీ 2020లో రూపొందించిన నిబంధన. అయితే, ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ వయస్సు 14 సంవత్సరాలు మాత్రమే. అతను వచ్చే ఏడాది మార్చి 27న 15 ఏళ్లు పూర్తి చేసుకుంటాడు. దీనికి ఇంకా సుమారు 100 రోజులు మిగిలి ఉంది. అంటే వైభవ్ కనీసం మరో 103 రోజుల పాటు జాతీయ జట్టులో సభ్యుడిగా చేరడానికి అవకాశం లేదు. ఈ నిబంధన కారణంగానే బీసీసీఐ అతన్ని నేషనల్ టీమ్‌లోకి తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

### ఐపీఎల్‌లో సెంచరీల మోత

ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లోనే సెంచరీ కొట్టి వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో భారత బ్యాట్స్‌మెన్లలో ఇదే వేగవంతమైన శతకం. ఆ తర్వాత భారత అండర్-19 జట్టు తరపున వన్డేలు, టెస్టుల్లో కూడా సెంచరీలు సాధించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా శతకం నమోదు చేశాడు. అండర్-19లో కూడా వైభవ్ మెరుపులు చూపిస్తున్నప్పటికీ, వయస్సు కారణంగానే అతను సీనియర్ టీమ్‌లో ఆడలేకపోతున్నాడు.

### వైభవ్ సూర్యవంశీ క్రికెట్ కెరీర్

గత ఐపీఎల్ వేలంలో వైభవ్ సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ జట్టు రూ.1.10కోట్లకు కొనుగోలు చేసింది. తన మొదటి ఐపీఎల్ సీజన్‌లో అతను 7 మ్యాచ్‌లలో 252 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 200 కంటే ఎక్కువగా (206.55) ఉండటం విశేషం. ఆ టోర్నమెంట్‌లో వైభవ్ మొత్తం 24 సిక్సర్లు కొట్టాడు. ఐపీఎల్ కాకుండా, వైభవ్ సూర్యవంశీ 8 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లలో 90 స్ట్రైక్ రేట్‌తో 207 పరుగులు చేశాడు. ఫస్ట్-క్లాస్‌లో అతని అత్యధిక స్కోరు 93 పరుగులు. లిస్ట్-ఎ క్రికెట్‌లో 6 మ్యాచ్‌లలో 110 స్ట్రైక్ రేట్‌తో 132 పరుగులు చేశాడు. మొత్తం 18 టీ20లలో వైభవ్ 3 సెంచరీలతో సహా 701 పరుగులు సాధించాడు.

# టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్..

## ఇరుజట్ల ప్లేయింగ్ ఎలెవన్ ఇదే..




భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఈరోజు కీలకమైన మూడో మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉంది. తొలి మ్యాచ్‌లో భారత్ 101 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండో టీ20లో సౌతాఫ్రికా 51 పరుగుల తేడాతో గెలిచింది. భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఈరోజు కీలకమైన మూడో మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉంది. తొలి మ్యాచ్‌లో భారత్ 101 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండో టీ20లో సౌతాఫ్రికా 51 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో ఈ రోజు మ్యాచ్ గెలిచి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ఉవ్విళ్లూరుతోంది. ధర్మశాల మైదానంలో సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ మొదలవుతుంది. సాయంత్రం 6:30 గంటలకు టాస్ జరిగింది. టాస్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. ధర్మశాల మైదానంలో సాధారణంగా ముందుగా బ్యాటింగ్ చేయడం లాభదాయకం. ఇక్కడ చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ 2022లో జరిగింది. అప్పటి నుంచి ఇక్కడ జరిగిన 5 ఐపీఎల్ మ్యాచ్‌లలో నాలుగుసార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన జట్లే విజయం సాధించాయి.

ఆటగాళ్ల ఫామ్, రికార్డులు

భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫామ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది టీ20 ఇంటర్నేషనల్‌లో సూర్యకుమార్ 8 సార్లు సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం కాగా, గిల్ 5 సార్లు సింగిల్ డిజిట్ స్కోర్ చేశాడు. ఈ ఫార్మాట్‌లో ఇప్పటికే తనను తాను నిరూపించుకున్న సంజు శాంసన్, గత రెండు మ్యాచ్‌లలో ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకోలేదు. ఈ మ్యాచ్‌లో విఫలమైన శుభ్‌మన్ గిల్ స్థానంలో కాకపోయినా, శివమ్ దూబే స్థానంలో సంజు శాంసన్‌కు అవకాశం దక్కవచ్చని అంచనా వేస్తున్నారు. భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 100 వికెట్ల మైలురాయికి కేవలం ఒక వికెట్ దూరంలో ఉన్నాడు. అలాగే, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి కూడా టీ20ఐలో 50 వికెట్లు పూర్తి చేయడానికి ఒక వికెట్ అవసరం. సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టగల సామర్థ్యం ఉన్న స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను భారత జట్టు మేనేజ్‌మెంట్ పట్టించుకోవడం లేదు. ఎనిమిదో స్థానం వరకు బ్యాటింగ్ సామర్థ్యం ఉన్న ఆటగాడిని ఉంచాలని భావించడం వల్ల కుల్దీప్‌ను పక్కన పెడుతున్నారు. వరుణ్ చక్రవర్తితో పాటు కుల్దీప్‌ను ఆడిస్తే బ్యాటింగ్ బ్యాలెన్స్ దెబ్బతింటుందని భావిస్తున్నారు. సౌతాఫ్రికా యువ బ్యాట్స్‌మెన్ డెవాల్డ్ బ్రెవిస్ ఈ ఏడాది టీ20 క్రికెట్‌లో 100 సిక్సర్లు కొట్టడానికి కేవలం నాలుగు సిక్సర్ల దూరంలో ఉన్నాడు. ఈ మైలురాయిని చేరుకుంటే, ఒక సంవత్సరంలో 100 ప్లస్ సిక్సర్లు కొట్టిన ఐదో ఆటగాడిగా, సౌత్ ఆఫ్రికా నుంచి రెండో ఆటగాడిగా (2024లో హెన్రిచ్ క్లాసెన్ తర్వాత) నిలుస్తాడు.

టీమ్ స్క్వాడ్‌లు

భారత జట్టు (స్క్వాడ్): సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, శివమ్ దూబే, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, సంజు శాంసన్, కుల్దీప్ యాదవ్.

సౌత్ ఆఫ్రికా జట్టు (స్క్వాడ్): ఎయిడెన్ మార్క్‌రమ్ (కెప్టెన్), డెవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్, రీజా హెండ్రిక్స్, క్వింటన్ డి కాక్ (వికెట్ కీపర్), డోనోవన్ ఫెరీరా, జార్జ్ లిండే, మార్కో జాన్సెన్, లుథో సిపమ్లా, లుంగీ ఎన్గిడి, క్వేనా మఫాకా, ఎన్రిక్ నోర్జే, ట్రిస్టన్ స్టబ్స్, ఓట్నీయెల్ బార్ట్‌మ్యాన్, కార్బిన్ బాష్, కేశవ్ మహారాజ్, టోనీ డి జోర్జీ.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- విద్యా వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com